ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 22 జూలై 2025


వాణిజ్య పన్నుల శాఖ సీజ్ చేసిన లారీలు

గ్రానైట్ అక్రమ రవాణాపై నిఘా

- జిల్లా, మండలస్థాయిల్లో టాస్క్‌ఫోర్సులు ఏర్పాటు
- 16 లారీలను సీజ్ చేసిన వాణిజ్య పన్నుల శాఖ
- మరో రూ.40 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అక్రమ మైనింగ్, గ్రానైట్ రవాణాపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. గ్రానైట్ అక్రమ రవాణాపై 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన వరుస కథనాలపై కలెక్టర్ పి.అరుణ్‌బాబు స్పందించారు. గ్రానైట్ అక్రమ మైనింగ్, రవాణాను అరికట్టేందుకు జిల్లా, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నామని సోమవారం ఆయన వెల్లడించారు. జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, సీటీవో, మైనింగ్ ఏడీ, అదనపు ఎస్పీ, డీఎస్పీలతో కూడిన జిల్లా స్థాయి కమిటీ మైనింగ్, అక్రమ రవాణాను కార్యకలాపాలను పర్యవేక్షించనుంది. మండల స్థాయి కమిటీలో తహసీల్దార్, ఎస్‌ఐ, రవాణ, వాణిజ్య పన్నులు, జీఎస్టీ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు.

నెలలో 35 గ్రానైట్ లారీలు స్వాధీనం

పల్నాడు జిల్లా నుంచి పెద్ద ఎత్తున గ్రానైట్ అక్రమ రవాణా జరుగుతోంది. నెల రోజుల వ్యవధిలో 35 గ్రానైట్ లారీలను వాణిజ్య పన్నుల శాఖ స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గ్రానైట్ మాఫియా లారీలను నిలుపుదల చేసిన వాణిజ్య పన్నుల శాఖ అధికారులను తీవ్ర స్థాయిలో బెదిరింపులకు పాల్పడింది. మూడు లారీలను సైతం జిల్లా సరిహద్దులను దాటించడం జరిగింది. గత నెలలో 17 లారీలను సీజ్ చేయగా ప్రభుత్వానికి పన్నులు, జరిమానాల రూపంలో రూ.42 లక్షలు ఆదాయం లభించింది. రెండు లారీలను నాలుగు రోజుల క్రితం, 14 లారీలను శనివారం స్వాధీనం చేసుకున్నారు. లారీకి రూ.2.50 లక్షలు జరిమానా, పన్ను వసూలు చేసినా.. దాదాపు రూ.40 లక్షల ఆదాయం ప్రభుత్వానికి రానుంది.

టాస్క్ ఫోర్సు ఏర్పాటుతో ప్రభుత్వానికి నెలకు రూ.కోట్లలో ఆదాయం రానుంది. గ్రానైట్ లారీకి సూమారు రూ.54 వేల వరకు పన్ను చెల్లించాల్సి ఉంది. నెలకు వందల సంఖ్యలో లారీల్లో గ్రానైట్ జీరో బిల్లులపై జిల్లా సరిహద్దులు దాటిపోతోంది. దీనిని అరికడితే ప్రభుత్వ ఖజానాకు కాసుల వర్షమే.

గడువిస్తేనే.. ధీమా!

పంటల బీమా చెల్లింపు గడువు సమీపిస్తోంది. పంటలు సాగు చేయకమునుపే బీమా గడువు ముగియనుంది. మొన్నటి వరకు తీవ్ర వర్షా భావంతో ఏ పంటలు సాగు చేయాలో ఇంకా అన్నదాతలు తేల్చుకోలేని స్థితిలో ఉన్నారు. రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పుడిప్పుడే సాగు పనులు ప్రారంభమవుతున్నాయి. పత్తి, కంది, మిరప పంటలకు బీమా ప్రిమియం చెల్లింపు గడువు ఈ నెలాఖరుకు ముగియనుంది. వరికి మాత్రం వచ్చే నెల 15వ తేదీ వరకు ఉంది. పంటల సాగు స్థితిని అంచనా వేయకుండానే పంటల బీమా గడువును నిర్ణయించడం ఏమిటని అన్నదాతలు ప్రశ్నిస్తు న్నారు. కనీసం ఆగస్టు నెలాఖరు వరకు బీమా గడువు పొడిగించాలని రైతులు కోరుతున్నారు.

పంటల బీమా గడువు నెలాఖరు వరకే

- వరికి మాత్రమే ఆగస్టు 15 చివరి తేదీ
- పత్తికి వాతావారణ ఆధారిత బీమా



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పత్తి పంట సాగు చేయక ముందే ఈ నెల 15న బీమా ప్రీమియం చెల్లింపు గడువు ముగిసింది. అయితే పల్నాడు జిల్లాలో పత్తి సాగుపై ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ నివేదిక పంపడంతో బీమా గడువును ఈ నెలాఖరుకు పొగించారు. పల్నాడులో పత్తి పంటను మాత్రమే వాతావరణ ఆధారిత బీమా పథకం కింద ఎంపిక చేశారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం కింద వరి, కంది, మిరప పంటలను ఎంపిక చేశారు. గడువు లోగా బీమా ప్రిమియం చెల్లించాలని వ్యవసాయ శాఖ రైతులకు సూచిస్తోంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పత్తి సరిగా సాగు చేయలేదు. ఇప్పుడిప్పుడే కురుస్తున్న వర్షాలతో పత్తి సాగుకు రైతులు సమాయత్తమవు తున్నారు. పల్నాడు జిల్లాలో పత్తి సాగు సాధారణ విస్తీర్ణం 2,28,915 ఎకరాలు కాగా, ఇప్పటికి 31,420 ఎకరాల్లో అంటే 14 శాతం మాత్రమే పత్తి సాగు చేశారు. గుంటూరు జిల్లాలో పత్తి సాధారణ విస్తీర్ణం 59,140 ఎకరాలు కాగా ఇప్పటికి 4,080 ఎకరాల్లో సాగు చేశారు. బాపట్ల జిల్లాలో పత్తి సాధారణ విస్తీర్ణం 6,307 ఎకరాలు కాగా, 26 ఎకరాల్లో మాత్రమే ప్రస్తుతం సాగైంది. వర్షాలు కొనసాగితే పత్తి సాగు చేయనున్నట్లు రైతులు చెబుతున్నారు. వాతావరణ ఆధారిత బీమా (మిగతా 6వ పేజీలో)

కమిటీ సరే.. కార్యక్రమాలేవి..?



- వెలవెలబోతున్న టౌన్‌హాల్
- అద్దె భారంతో వెనుకంజ వేస్తున్న కళా సంస్థలు

నరసరావుపేట కల్చరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన పట్టణంలోని భువనచంద్ర టౌన్‌హాల్ ప్రాభవం కోల్పోతోంది. నవ్యాంధ్ర తొలి సభాపతి, దివంగత నేత డాక్టర్ కోడెల శివప్రసాదరావు నేతృత్వంలో సంగీత, సాహిత్య, నృత్య కార్యక్రమాలు, నాటక ప్రదర్శనలు, నెలవారీ కార్యక్రమాలతో టౌన్‌హాల్ విరాజిల్లింది. ఎన్ని పనులున్నా ఇక్కడ జరిగే కార్యక్రమాలకు కోడెల హాజరయ్యేవారు. ప్రముఖ తబలా విద్వాంసులు యల్లా వెంకటేశ్వర్లు, ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు, సంక్రాంతి సంబరాలు, దక్షిణ భారత సంగీత, నృత్య అకాడమీ అధ్వర్యంలో వివిధ రాష్ట్రాల నృత్య రూపకాల ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి.

కోడెల మరణంతో గ్రహణం..

దురదృష్టవశాత్తు కోడెల శివప్రసాదరావు కాలం చేయడంతో.. భువన చంద్ర టౌన్ హాలుకు గ్రహణం పట్టింది. నెలవారీ కార్యక్రమాలు రద్దు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలకు నెలవైన టౌన్ హాల్‌ను కేవలం ప్రస్తుతం ప్రభుత్వ కార్యక్రమాలకు వేదికగా మార్చారు. ఇటీవలే నూతన కమిటీని ఏర్పాటు చేసారు కానీ, కార్యక్రమాల ఊసు మాత్రం కానరావట్లేదు. గత ప్రభుత్వ హయాంలో బకాయి పడ్డ రూ.30 లక్షల (మిగతా 6వ పేజీలో)


పొందుగల సమీపంలో వైసీపీ హయాంలో పట్టాలు పొందిన ఎద్దుల బీడు పొంతం

భూ ఆక్రమణలపై విచారణ ఎప్పుడో?

- కమిటీ వేస్తామని కలెక్టర్ ప్రకటన
- రెండు నెలలు దాటినా అడుగు పడని వైనం
- ఉదాసీనంగా రెవెన్యూ అధికారులు

పిడుగురాళ్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు యథే చ్ఛగా గురజాల నియోజకవర్గంలో ప్రభుత్వ, పట్టా భూములు అనే తేడా లేకుండా ఆక్రమించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవు తున్నాయని రెవెన్యూ అధికారులకు అందిన ఫిర్యాదులు బుట్ట దాఖలయ్యాయి. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే కొద్ది రోజుల ముందు కూడా పిడుగురాళ్ల, గురజాల, మాచవరం, దాచేపల్లి మండలాల్లో ప్రభుత్వ భూములను అధికారుల అండదండలతో కొందరు నేతలు పట్టాలు పొందారు. వాటిని బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు పొందారు.

విచారణ కమిటీ సంగతేంటీ..

గురజాల నియోజకవర్గంలో వైసీపీ హయాంలో జరిగిన భూకుంభ కోణంపై ఇప్పటికే కొంత సమాచారం సేకరించామని (మిగతా 6వ పేజీలో)

వారికి న్యాయం జరిగేనా..?

గురజాల నియోజకవర్గంలో వైసీపీ నేతల దాడులకు భయపడి గ్రామాలను వదిలివెళ్లిన టీడీపీ నేతల భూములను కొందరు వైసీపీ నేతలు తమ పేర్లపై నమోదు చేయించుకున్నట్లు రెవెన్యూ రికార్డులు పరిశీలిస్తే తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దాచేపల్లి మండలంలోని తంగెడ గ్రామ సమీపంలో ఓ సిమెంట్ పరిశ్రమ కొనుగోలు చేసిన భూముల రికార్డుల్లో పేర్లు మార్చి వైసీపీ నేతల పేర్లు నమోదు చేయించుకొన్నారు. ఆ భూములనే మళ్లీ ఫ్యాక్టరీ కొనుగోలు చేసేలా ఒత్తిడి తెచ్చిన వైసీపీ నేతల తీరును అప్పట్లో టీడీపీ, జనసేన నేతలు ఖండించారు.

మార్చి నాటికి ప్రభుత్వ భవనాలు

- అమరావతి నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి నారాయణ

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. రాజధానిలో జరుగుతున్న నిర్మాణ పనులను సీఆర్డీఏ ఇంజనీర్లతో కలిసి మంత్రి నారాయణ సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం రాజధానిలో అన్ని పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కొన్ని చోట్ల మాత్రం వర్షాల కారణంగా కొంచెం ఇబ్బందులున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు 12 టవర్లలో 288 ప్లాట్లు, ఆలిండియా సర్వీస్ అధికారులకు 6 టవర్లలో మొత్తం 144 ఫ్లాట్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రధాన కార్యదర్శుల కోసం 25 బంగ్లాలు, సెక్రటరీల కోసం 90 బంగ్లాలు, మంత్రుల కోసం 35 బంగ్లాలు, జడ్జిల కొరకు 36 బంగ్లాలు, నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కొరకు మొత్తం 21 టవర్లలో 1968 ఫ్లాట్లు నిర్మిస్తున్నామని మంత్రి నారాయణ వివరించారు. గెజిటెడ్ అధికారుల్లో టైప్-1 అధికారుల కోసం 4 టవర్లలో 384 ఫ్లాట్లు, టైప్- 2 అధికారుల కోసం 4 టవర్లలో 336 ఫ్లాట్లు, గ్రూప్- డీ ఉద్యోగుల కొరకు మొత్తం 6 టవర్ల లో 720 ఫ్లాట్లు నిర్మిస్తున్నట్లు ఆయన తెలియ జేశారు. అమరావతి లోని హ్యాపీనెస్ట్ 6 టవర్లలో 1200 ఫ్లాట్లు నిర్మాణం జరుగుతుందన్నారు. వాటి ఫైలింగ్ వర్కులు వేగంగా (మిగతా 6వ పేజీలో)


అధికారుల భవనాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ


ప్రీఎన్ఐ, ఎన్ఐ వర్కులతో

పలు రైళ్ల రద్దు

- కొన్ని పాక్షిక రద్దు, దారి మళ్లింపు, క్రమబద్ధీకరణ

కడలి గర్భశోకం



- కలుషితమవుతున్న సముద్ర జలాలు
- మృత్యువాత పడుతున్న తాబేళ్లు, డాల్ఫిన్లు
- కాలుష్య కోరల్లో తీర ప్రాంతాలు
- పర్యావరణ పరిక్షణను పట్టించుకోని అధికారులు

సాంస్కృతిక వికాసానికి పునరంకితం కావాలి


- ప్రముఖ సినీ రంగస్థల నటుడు, దర్శకుడు కేఎస్‌టీ సాయి

8

ఎంఈవోలకూ.. ముఖ హాజరు

- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్

6


పెదకూరపాడు : కంభంపాడు పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

జోరు వాన

- అన్నదాతల హర్షం
- దుర్గి మండలంలో 89 మిమీ వర్షపాతం
- పలుచోట్ల పొంగిన వాగులు
- రాకపోకలకు అంతరాయం

నరసరావుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా అంతటా రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. సాగు చేసిన పంటలకు జీవం పోయగా.. పంటల సాగుకు వర్షాలు దోహదపడ్డాయి. పలు చోట్ల భారీ వర్షాలు కురిశాయి. దుర్గి మండలంలో అత్యధికంగా 89 మీమీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ సోమవారం వెల్లడించింది. నాదెండ్ల మండలంలో 55.4 మిమీ, నరసరావుపేట 51.2, క్రోసూరు మండలంలో 50, రొంపిచర్ల 47.2, మాచర్ల 46, అమరావతి 45.2, సత్తెనపల్లి 42.8 నూజెండ్ల 41.5, నాదెండ్ల 39.5 మి.మీ వర్షపాతం నమోదైంది. చిలకలూరిపేట 39.2 పెదకూరపాడు 38.2, రాజుపాలెం 36.6, ముప్పాళ్ల 36.4, రెంటచింతలలో 21.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 10 నుంచి 20 మీమీ వర్షపాతం నమోదైంది. వర్షాలు తగ్గగానే కంది, పత్తి, మొక్కజొన్న విత్తనం విత్తేందుకు రైతులు సమా యత్తమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. అప్రమత్తమైన అధికారులు తగు చర్యలకు ఉపక్రమించారు.

- అమరావతి-విజయవాడ రహదారిలోని పెదమద్దూరు చప్టాపై వాహనాల రాకపోకలను రెవెన్యూ, పోలీసు అధికారులు నిలిపివేసి పోలీసు సిబ్బందిని కాపలా ఉంచారు.
- సత్తెనపల్లి, మేడికొండూరు మండలాల నుంచి వస్తున్న వరదనీటితో మండల పరిధిలోని ఎండ్రాయి-నరుకుళ్లపాడు గ్రామాల మధ్య ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తూ వం దలాది ఎకరాలను నీటముంచింది. ఎండ్రాయి వాగు ప్రభావంతో రైతన్నలు సాగు చేసిన పత్తికి కొంతమేర నష్టం కలిగింది.
- పిడుగురాళ్ళ పట్టణంలోని డ్రెయిన్స్ అన్నీ చెత్తాచెదా రంతో పేరుకుపోవడం వల్ల వర్షపునీరు అంతా రోడ్లపై ప్రవహిస్తుంది. మార్కెట్ యార్డు సమీపంలో బుగ్గ వాగు వర్షం నీటితో పొంగుతోంది.
- సత్తెనపల్లి పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజ్‌లోకి వర్షపునీరు చేరింది. సబ్ ట్రెజరీ కార్యాలయంలో వర్షపు నీరు చేరింది. పట్టణంలోని ఏరియా వైద్యశాల వరండాలో కూడా వర్షం నీరు నిలిచింది.
- బెల్లంకొండ మెయిన్ సెంటర్ వర్షపు నీటితో నిండిపోయింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బెల్లంకొండ ఎస్టీ కాలనీలోని గృహాల్లోకి వర్షపు నీరు చేరింది. మన్నెసుల్తాన్‌పాలెం వద్ద లోలెవల్ చప్టాపై వర్షపు నీరు పొర్లటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.
- ఓబులేశునిపాలెం, దుర్గి మధ్యలోని కొండ వాగు తీవ్ర రూపం దాల్చడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్ప డింది. అలాగే దుర్గిలోని బండ్లవాగు పొంగి పొర్లింది. గ్రా మాల్లో వీధులు జలమయమయ్యాయి.
- గురజాల నుంచి కారంపూడి వెళ్లే వాహనాలను నిలిపి వేస్తామని ఆర్‌అండ్‌బీ డీఈఈ రమణయ్య, ఏఈఈ షేక్ యూసఫ్‌లు సోమవారం తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి గురజాల నుంచి కారంపూడి వెళ్లే రహదారిలో చర్లగుడిపాడు - లక్ష్మీపురం గ్రామాల మధ్యలో ఎర్రవాగు రోడు సగభాగం 6 తూములు కూలి ప్రమాదకరంగా ఉంది. గురజాల నుంచి కారంపూడి వెళ్లే వాహనాలు వేరే మార్గం ద్వారా వెళ్లాలని సూచించారు.
- కారంపూడి గాంధీ బొమ్మ సెంటర్ సచివాలయం - 1 వెనుక బజారు మొత్తం ప్రతి ఇంట్లోకి నీళ్లు వెళ్లి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గృహాల్లోకి నీరు చేరి సామాన్లు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.


కారంపూడిలో ఇంట్లోకి చేరిన వర్షపునీరు


వర్షపు నీటిలో రెంటచింతల పశు వైద్యశాల


మాచవరం: పత్తి పొలంలో నిలిచిన వర్షపు నీరు


ప్రీ మ్యారిటల్ కౌన్సెలింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ అరుణ్ బాబు

కుటుంబ వ్యవస్థపై కౌన్సెలింగ్

- ప్రీ మ్యారిటల్ కౌన్సెలింగ్ కేంద్రాల పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట లీగల్, జులై 21, (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని పీజీఆర్ ఎస్ హాల్లో కలెక్టర్ అరుణ్‌బాబు సోమవారం ప్రీ మ్యారిటల్ కౌన్సిల్ సెంటర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా ఈ పోస్టర్‌ని ఆవిష్కరించినట్లు జిల్లా సాధికారిత అధికారి ఉమాదేవి తెలిపారు. మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా జాతీయ మహిళా కమిషన్.. తొమ్మిది రాష్ట్రాల్లో వివాహానికి ముందు జంటలకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ఈ కేంద్రాలను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. మార్చి 8న మహిళా దినోత్సవం రోజు ఏర్పాటై.. తేరే మేరే సప్నే అని పిలవబడే ఈ కేంద్రాల్లో.. వివాహం చేసుకోబోయే జంటలకు, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమర్థంగా కుటుంబాన్ని నిర్వహించుకునేలా వారికి వివరిస్తామని చెప్పారు. జేసీ సూరజ్ ధనుంజయ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు .

ఇద్దరు మార్కెటింగ్ సూపర్‌వైజర్ల ఇంక్రిమెంట్ల కోత

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గతంలో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న నల్లపాడు గొర్రెలమండిలో సెస్సు వసూళ్లలో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు సూపర్‌వైజర్లపై ప్రభుత్వం శాఖాపరమైన చర్యలు తీసుకొంది. 2019 డిసెంబరు 20న మండిలో ఆకస్మిక తనిఖీలను అధికారులు నిర్వహించారు. ఆ సమయంలో భారీ వ్యత్యాసాలు కనిపించాయి. దీంతో సూపర్‌వైజర్లు ఎన్.అంజిబాబు (ప్రస్తుతం తెనాలి ఏఎంసీ), కె. రామకృష్ణ(ప్రస్తుతం గురజాల ఏఎంసీ)లను బాధ్యులుగా గుర్తిస్తూ అభియోగాలు నమోదు చేశారు. విచారణ జరిపిన అధికారులు ఇద్దరికి ఒక యాన్యువల్ గ్రేడ్ ఇంక్రిమెంట్‌ని క్యుములేటివ్ ఎఫెక్ట్‌తో నిలిపేస్తూ చర్య తీసుకొన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఎక్స్ అఫీషియో స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'విజ్ఞాన్స్'లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



కార్యక్రమానికి హాజరైన ప్రతినిధులు

గుంటూరు (విద్య)జూలై 21 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సోమవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభమైంది. విజ్ఞాన్ టీబీఐ ఆధ్వర్యంలో ఏఐసీటీఈ, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్స్ ఇన్నోవేషన్ సెల్‌ల ఆర్థిక సౌజన్యంతో 5 రోజుల పాటు "ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్"పై ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 60కి పైగా ఉన్నత విద్యాసంస్థల అధ్యాపకులు ఇందులో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన అస్పైర్ టీబీఐ సీఈవో డాక్టర్ బీఎస్ రామక్రిష్ణ మాట్లాడుతూ ఇంటర్ డిసిప్లినరీ లెర్నింగ్ ప్రాముఖ్యతను, "క్రియేటివిటీ అండ్ ఐడియా జనరేషన్" గురించి వివరించారు. మానసిక అడ్డంకులను ఎలా అధిగమించాలో, కొత్త ఆలోచనలను ఎలా కల్పించాలో అధ్యాపకులకు వివరించారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన అశోక ఇన్నోవేషన్ కోచ్ డాక్టర్ రవి చంద్ర రాజు మాట్లాడుతూ సమస్యలపై విద్యార్థుల్లో దృష్టికోణాన్ని పెంపొందించేలా అధ్యాపకులు మారాలని సూచించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● రూ.30వేల నగదు, బంగారు, వెండి వస్తువుల చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, పరిశీలిస్తున్న ఎస్ఐ శివరామకృష్ణ

యడ్లపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో కుమారుడి వద్ద ఉంటూ తరచూ స్వంత గ్రామానికి వచ్చి వెళుతూ ఉండే ఓ వృద్ధురాలి ఇంట్లో దొంగలు పడ్డారు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు నగదు, బంగారు, వెండి వస్తువులను అపహరించుకెళ్ళారు. ఆదివారం వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. యడ్లపాడు మండలం మైదవోలు గ్రామానికి చెందిన బండారు వరలక్ష్మి హైదరాబాద్‌లోని కుమారుడి వద్ద నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం ఇరుగు పొరుగువారు ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి హైదరాబాద్‌లోని వరలక్ష్మికి ఫోన్‌చేసి సమాచారం అందించారు. హుటాహుటిన గ్రామానికి వచ్చిన ఆమె ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా వస్తువులన్నీ చిందరవందరగా నేలపై పడి ఉనాయి.. బీరువాలో దాచిన రూ.30వేల నగదుతోపాటు 4 గ్రాముల బంగారు, 40 గ్రాముల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ విషయమై యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాల ఫుటేజిని పోలీసులు పరిశీలించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో ముఖం కనిపించకుండా హెల్మెట్ ధరించిన దుండగుడు ఇంటి ప్రధాన ద్వారం తాళం పగులుగొట్టి లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ వెల్లడించారు.

ఎంఈవోలకూ.. ముఖ హాజరు

- పనితీరు మెరుగుకు ప్రభుత్వం చర్యలు
- విధిగా రోజుకు ఒక పాఠశాల తనిఖీ
- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్

సత్తెనపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యాశాఖ అధికారులు ఇక నుంచి ఉదయం 9 గంటలకు ముఖ హాజరు వేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఇక ఎప్పుడు పడితే అప్పుడు వెళ్ళి రావచ్చనే వారికి చెక్ పడనుంది. ప్రతి రోజు ఉదయం 9 గంటలకు ఎంఆర్‌సీలకు వెళ్ళి ఎంఈవోలు ఆన్‌లైన్‌లో ముఖ హాజరు వేయాలి. ఏదో ఒక పాఠశాలను తనిఖీ చేయాలి. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల పర్యవేక్షణ, విద్యా పథకాలు, హెచ్‌ఎంలు, టీచర్ల పనితీరు, ప్రమాణాలను పర్యవేక్షించటానికి ఎంఈవోలను ప్రభుత్వం నియమించింది. గత వైసీపీ పాలనలో ప్రతి మండలానికి అదనంగా ఎంఈవో-2ను నియమించారు. ఐనా పాఠశాలల పర్యవేక్షణ గాడిన పడలేదు. ఇద్దరు ఎంఈవోలు ఉండటంతో అనేక మండలాల్లో ఆధిపత్య పోరు మొదలైంది. ఇంకో వైపు చాలా మంది ఎంఈవోలు స్థానికంగా నివాసం ఉండకుండా జిల్లా డివిజన్ కేంద్రాల్లోనే నివాసం ఉంటున్నారు. దీంతో పని వేళలు పాటించటం లేదు. ఎప్పుడో వెళ్ళి హాజరు వేసుకుంటున్నారు. కొందరైతే జిల్లా కేంద్రంలో ఉంటూ అక్కడి నుంచే ఏదో ఒక కారణం చూపి ముఖహాజరు నమోదు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎంఈవోలతో పాటు ఎంఆర్‌సీలలో పని చేస్తున్న సీఆర్‌పీలు, ఆపరేటర్లు, ఇతర కింది స్థాయి సిబ్బంది కూడా 9 గంటలకే ముఖ హాజరు వేయాల్సి ఉంటుంది.

హాజరు తనిఖీలపై రోజూ నివేదిక

తోచిన కారణాలు చెప్పి తప్పించు కోవటానికి అవకాశం లేకుండా ఎంఈవోల మెడకు కమిషనర్ కత్తి బిగించారు. టీచర్ల మాదిరిగానే ఉదయం 9:30 గంటలకు ఎంత మంది ఎంఈవోలు హాజరు వేసింది జిల్లా విద్యాశాఖ ప్రతి రోజు కమిషనరేట్‌కు నివేదిక పంపించాలి. గతంలో కొందరు ఎంఈవోలు డివిజన్, జిల్లా కేంద్రాల నుంచి ఎప్పుడో బయలు దేరి దగ్గర ఉన్న పాఠశాలలకు వెళ్ళి తూతూ మంత్రంగా తనిఖీలు చేసి హాజరైనట్టు నమోదు చేసుకొనే వారు. ఇప్పుడలా కాకుండా ఎంఈవోలకు జీపీఎస్ విధానం అమలు చేస్తున్నారు. ఎంఆర్‌సీకి వెళితే అక్కడ లోకేషన్ చూపిస్తుంది. పాఠశాలలకు వెళితే అక్కడ లోకేషన్ చూపిస్తుంది.

భూ అక్రమాలపై విచారణ ఎప్పుడో?

(5వ పేజీ తరువాయి)

పూర్తిస్థాయి విచారణకు అధికారులతో కమిటీ నియమించనున్నట్లు మే-15న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు పిడుగురాళ్లలో వెల్లడించారు. ఇది జరిగి రెండు నెలలు గడుస్తున్నా ఇంత వరకు కమిటీ నియామకం అతీగతి లేదు. పట్టాభూములు కోల్పోయిన వారికి సరైన న్యాయం జరగకపోవడంతో వారిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ప్రకటించినా అక్రమాలు వెలికితీయడంలో రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఆక్రమణలు ఇలా..

దాచేపల్లి మండలం పొందుగల సమీపంలోని ఎద్దుల బీడులో కొంత భాగానికి వైసీపీ నేతలు పట్టాలు పొంది.. బ్యాంక్ రుణాలు తీసుకున్నారు. తంగెడ జడ్పీ ఉన్న పాఠశాల స్థలాన్ని వైసీపీ నేత ఒకరు రెవెన్యూ రికార్డుల్లో తనదిగా చూపి బ్యాంక్ రుణం పొందారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పులిచింతల ప్రాజెక్టు పేరుతో హక్కులున్న కొన్ని భూములను మాచవరం, మోర్జంపాడు, పిన్నెల్లి గ్రామాలకు చెందిన వైసీపీ అనుయాయుల పేర్లతో రెవెన్యూ రికార్డులో చేర్చి యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడ్డారు. పిడుగురాళ్ల బైపాస్‌కు ఇరువైపులా ఉన్న స్థలాలను కూడా కొందరు వైసీపీ నేతలు అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఆక్రమణలకు పాల్పడ్డారు. అప్పటి రెవెన్యూ అధికారి భాస్కరరావు అన్ని విధాల సహకరించి వీఆర్‌ఓ, ఆర్ఐ, డీటీ నివేదికలు ఏమీ లేకుండానే డైరెక్ట్‌గా 1-బీ, అడంగల్‌లో పేర్లు నమోదు చేయించారు. అయితే.. దీనిపై రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడం, ప్రాథమిక విచారణలో అవి నిజమేనని తేలడంతో పదవీ విరమణ పొందిన భాస్కరరావుకు ప్రభుత్వ పరంగా రావాల్సినవన్నీ నిలిపివేశారు. గురజాల మండలంలోని దైద సమీపంలోని అటవీ ప్రాంతాన్ని కొందరు ఆక్రమించి రెవెన్యూ భూమిగా చూపి పట్టాలు పొందారు. దాచేపల్లి తహసీల్దార్‌గా పనిచేసిన కుటుంబరావు ప్రభుత్వ పోరంబోకు భూములను ఇష్టానుసారంగా రెవెన్యూ రికార్డుల్లో పేర్లు మార్చి లబ్ధి పొందారని.. అధికారుల విచారణలో తేలడంతో గతవారం ఆయనను సస్పెండ్ చేశారు.

కమిటీ సరే.. కార్యక్రమాలేవి..?

(5వ పేజీ తరువాయి)

విద్యుత్తు బిల్లు గుదిబండగా మారింది. టౌన్‌హాల్‌లో చాలా మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇవన్నీ కొత్తగా కమిటీకి పెనుభారంగా మారాయి. టౌన్‌హాల్ చుట్టూ దుకాణ సముదాయం నిర్మిస్తే కొంత ఆదాయం వస్తుందని కొందరు సూచిస్తున్నారు. సమాజాలకు, కళా సంస్థల నిర్వాహకులకు నామమాత్రపు అద్దెతో టౌన్‌హాల్‌లో ప్రదర్శనకు అనుమతివ్వాలని నటుడు, దర్శకుడు ఎస్.ఎం.బాషా పేర్కొన్నారు. రవీంద్రభారతి మాదిరిగా మినీ హాల్‌ను నిర్మించాలి. సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం చేయాలని ఆయన కోరారు.

ఆగస్టు నుంచి నెలవారీ ప్రదర్శనలు

కొత్తగా వచ్చిన తమకు సమస్యలే స్వాగతం పలికాయని టౌన్‌హాల్ ఉపాధ్యక్షుడు జంపని వెంకట్రావు తెలిపారు. దాతల సహాయంతో మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. ఆగస్టు నుంచి నెలవారీ కార్యక్రమాలు చేపడతామని, భువనచంద్రకు పూర్వ వైభవం తీసుకొస్తామని ఆయన తెలిపారు.

మార్చి నాటికి ప్రభుత్వ భవనాలు


(5వ పేజీ తరువాయి)

జరుగుతున్నాయని ఆయన అన్నారు. మొత్తం భవనాల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఏఐఎస్ అధికారుల క్వార్టర్లు ఈ ఏడాది డిసెంబర్‌లోగా పూర్తిచేస్తామని, ఇతర నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. ఐకానిక్ భవనాల నిర్మాణాలపై కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు, డిజైన్ రూపొందించిన నార్మన్ ఫోస్టర్స్ సంస్థ ప్రతినిధుల మధ్య తుది చర్చలు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే ఐకానిక్ భవనాల నిర్మాణం కూడా ప్రారంభిస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. నెలాఖరునాటికి 90 శాతం మ్యాన్ పవర్‌తో పనులు జరిపిస్తామని ఆయన చెప్పారు.

● డిసెంబర్ నాటికి మెజారిటీ సంస్థల నిర్మాణాలు ప్రారంభం

అమరావతిలో ఇప్పటివరకూ మొత్తం 72 సంస్థలకు భూకేటాయింపులు చేసినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఆయా సంస్థల ప్రతినిధులతో స్వయంగా సీఎం చంద్రబాబు సమావేశం ఏర్పాటు చేసి ఒప్పందాలు చేసుకున్నట్లు చెప్పిన ఆయన, వాటిలో మెజారిటీ సంస్థలు ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి నిర్మాణ పనులు ప్రారంభిస్తాయన్నారు.

గుర్రపు డెక్క చుట్టుకుని పశువుల మృతి



రేపల్లె డ్రెయిన్‌లో పడి మృతి చెందిన పాడి పశువు

వేమూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతుమర్రు ఎస్టీ కాలనీకి చెందిన చౌటూరి చినపిచ్చయ్యకు చెందిన నాలుగు పాడి పశువులు సోమవారం రేపల్లె మెయిన్ డ్రెయిన్‌లో గుర్రపు డెక్కకు చుట్టుకుపోయి మృతి చెందాయి. పోతుమర్రు, చంపాడు గ్రామాల మధ్యలో ఉన్న ప్రధానమైన మురుగు కాల్వలో సంబంధిత అధికారులు గుర్రపుడెక్కను తొలగించలేదు. పిచ్చయ్యకు చెందిన నాలుగు పాడి పశువులు కాల్వలో దిగాయి. నాలుగు పశువులు కనపడని కారణంగా గ్రామస్తులు కాల్వలో దిగి గాలింపు ప్రారంభించారు. మూడు పశువులు మృతి చెంది గుర్రపు డెక్కకు చిక్కుకుపోయిన ఉన్నట్లు గుర్తించారు. మరో పాడి పశువు కనబడటం లేదు. అప్పు చేసి పాడి పశువులపై జీవనం సాగిస్తున్న పిచ్చయ్య తన జీవనోపాధిని కోల్పోయానని విలపిస్తున్నాడు. నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లనే తనకు రూ.2.50లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం ద్వారా తనకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నాడు. బ్యాంకు ద్వారా చేసిన అప్పు చేసి రద్దు చేయించాలని విన్నవించుకుంటున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

ఎల్‌హెచ్‌బీ బోగీలతో లక్నో ఎక్స్‌ప్రెస్ అప్‌గ్రేడ్

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వారంలో రెండు రోజులు న్యూగుంటూరు మీదగా రాకపోకలు సాగించనున్న లక్నో ఎక్స్‌ప్రెస్‌ని ఎల్‌హెచ్‌బీ బోగీలతో రైల్వే శాఖ అప్‌గ్రేడ్ చేసింది. ఈ నెల 26వ తేదీ నుంచి నంబరు. 16093 చెన్నై సెంట్రల్ - లక్నో ఎక్స్‌ప్రెస్‌ని, 28వ తేదీ నుంచి లక్నో - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌ని ఎల్‌హెచ్‌బీ బోగీలతో నడపనున్నట్లు రైల్వే శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. దీని వలన ఏసీ టూటైర్ ఒకటి, ఏసీ త్రీటైర్ ఎనిమిది, స్లీపర్‌క్లాస్ నాలుగు, జనరల్ సెకండ్ క్లాస్ ఒకటి, ఎస్ఎల్ఆర్ ఒకటి బోగీలతో ఈ రెండు రైళ్ల ప్రయాణిస్తాయి.

లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌కి మరో ఏసీ త్రీటైర్ ఎకానమి బోగీ

నిత్యం గుంటూరు మీదగా రాకపోకలు సాగించే విజయవాడ - లింగంపల్లి - విజయవాడ ఎక్స్‌ప్రెస్‌లను శాశ్వతంగా మరో అదనపు ఏసీ త్రీటైర్ ఎకానమి బోగీని జోడించనున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. నంబరు. 12795 విజయవాడ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 26, నంబరు. 12796 లింగంపల్లి - విజయవాడ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 27 నుంచి అదనపు బోగీలు జోడించి నడపనున్నట్లు పేర్కొన్నది.

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

రూ.10.37 లక్షల విలువ గల చోరీ సొత్తు సీజ్ చేసిన పోలీసులు



నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టిన బాపట్ల సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్

బాపట్లరూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల, గుంటూరుజిల్లాలలో రాత్రిపూట వరస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని బాపట్ల సీసీఎస్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అరెస్టుకు సంబంధించిన వివరాలను జిల్లా సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్ సీసీఎస్ పోలీసుస్టేషన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల మండలం మూలపాలెం గ్రామానికి చెందిన బెజ్జం జగదీష్ అనే వ్యక్తి చెడు వ్యసనాలకు అలవాటుపడి దొంగతనాలను ప్రారంభించాడు. బాపట్లజిల్లాలో జరుగుతున్న వరుస దొంగతనాల కేసులను సవాల్‌గా తీసుకున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడి పర్యవేక్షణలో సీసీఎస్ పోలీసుబృందం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితుడు బెజ్జం జగదీష్‌ను పర్చూరు, చిలకలూరిపేట వెళ్ళేరోడ్డులోని వైజంక్షన్ వద్ద అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి మూడు ఎల్‌ఈడీ టీవీలు, కంప్యూటర్, ఒకప్రింటర్, బంగారుచైను, సెల్‌ఫోన్‌లు, నల్లపూసల గొలుసు మొత్తంగా రూ. 10లక్షల 37వేల విలువగల రికవరి సొత్తును స్వాధీనం చేసుకొని సీజ్ చేయటం జరిగిందని తెలిపారు. దొంగతనాల కేసు ఛేదనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సీసీఎస్ బాపట్లఇన్‌స్పెక్టర్ పి.ప్రేమయ్య సీసీఎస్ ఎస్సై రవిప్రకాష్, బి.రాంబాబు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

ఇంటి నిర్మాణాల పేరుతో మోసం

తెనాలిలో కాంట్రాక్టర్ అరెస్టు



కాంట్రాక్టర్‌ను మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచేందుకు తీసుకువెళుతున్న ఎస్ఐ ఆనంద్

తెనాలి రూరల్, జూలై21(ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణాల పేరుతో నగదు తీసుకుని లబ్ధిదారులకు నిర్మాణ పనులు పూర్తిచేయకుండా తప్పించుకు తిరుగుతున్న కాంట్రాక్టర్‌ను అరెస్టు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం తెనాలి మం డలంలోని పెదరావూరులో నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా గత ప్రభుత్వంలో నివేశన స్థలాలను లబ్ధిదారులకు అందించారు. వాటిల్లో ఇంటి నిర్మాణాలకు గానూ ప్రభుత్వం హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి రూ.1,80,000 వంతున మంజూరు చేసింది. దీంతో ఇంటి నిర్మాణానికి కాంట్రాక్ట్ పద్ధతిలో కట్టి అప్పగిస్తామని తెనాలి మారీసుపేటకు చెందిన ఎస్‌జీ బిల్డింగ్ వర్క్స్ కాంట్రాక్టర్ అండ్ ఏజెంట్ పున్నారావు పలువురు లబ్ధిదారులను నమ్మబలికారు. నగదుతీసుకుని అగ్రిమెంట్ చేసి సకాలంలో ఇంటినిర్మాణ పనులు పూర్తిచేసి వారికి అప్పగించలేదు. నిర్మా ణ పనులపై లబ్ధిదారులు కాంట్రాక్టర్‌ను ప్రశ్నించినా సరైన సమాధానం చెప్పకుండా నగదు తిరిగి చెల్లించకుండా మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని పలువురు లబ్ధిదారులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే కాంట్రాక్టర్‌పై గతంలో బుర్రిపాలెం, నేలపాడు గ్రామాల లేఅవుట్లకు సంబంధించి మోసం చేశాడన్న ఫి ర్యాదుతో న్యాయస్థానంలో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. నరసరావుపేట సబ్‌జైల్లో ఉన్న నిందితుడిని పీటీ వారెంట్‌పై తీసుకువచ్చి తెనాలి మెజిస్ట్రేట్ ఏదుట హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. తిరిగి నరసరావుపేట జైలుకు తరలించినట్లు ఎస్ఐ ఆనంద్ పేర్కొన్నారు. రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

బీజేపీ గుంటూరు జిల్లా నూతన పదాధికారుల జాబితా విడుదల

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా నూతన పదాధికారుల జాబితాని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు సోమవారం విడుదల చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా మంత్రి సుగుణ, సాధు రామకృష్ణ, వంగిపురపు విమలాదేవి, రెడ్డి శివ పార్వతి, కటారి వాసుదేవ నాయుడు, కత్తి మేరీ సరోజినిని నియమించామన్నారు. ప్రధాన కార్యదర్శులుగా హెచ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు, కార్యదర్శులుగా పంచుమర్తి ప్రసాద్, ఆర్ వెంకటలక్ష్మి, మార్తా నరేంద్ర, నారదాసు వీరమణీంద్ర, కే నారాయణ రెడ్డి, సురేష్ కుమార్ జైన్, దానబోయిన శివయ్య, కోశాధికారి ఆమతి వెంకటరమణ, ఐటీ కన్వీనర్‌గా కటకం అనూష, సోషల్ మీడియా కన్వీనర్ తూనుగుంట్ల రాజేష్‌ని నియమించినట్లు పేర్కొన్నారు.

అరాచకాలను చూడలేకనే వైసీపీకి బుద్ధి చెప్పారు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



వర్షంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ చేసిన అరాచకాలు, విధ్వంసం, దుర్మార్గపు పాలనను చూడలేకనే విసిగి పోయిన ప్రజలు గత ఎన్నికల్లో వైసీపీని ఓడించి బుద్ధి చెప్పారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్లాయపాలెం, బుక్కాపురం, ఎండుగుంపాలెం గ్రామాల్లో జోరు వానలోనూ పుల్లారావు పర్యటించారు. ఈ సందర్భంగా ఎండుగుంపాలెంలో మాట్లాడుతూ వైసీపీ హయాంలో రైతులు పండించిన సుబాబుల్ కర్రను అమ్ముకోనివ్వకుండా వేధించారన్నారు. అలాంటి వారే ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. రైతుల కష్టాలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళానని, ఈ క్రమంలోనే పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సాగు నీటి సంఘాల చైర్మన్ నెల్లూరి రామారావును ఆయన అభినందించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ కరి ముల్లా, నాయకులు ఎన్ సదాశివరావు, బీ సత్యనారాయణ, జే మదన్, ఎన్ హరిబాబు, కే రమణ, డీ శ్రీనివాసరావు, జీ రమేష్, సుమన్, సింగయ్య, జయప్ర సాదు, విజయ సాయి, రాయన్న, ఇన్నయ్య, సుభానీ, రాఘవయ్య, అశోక్, రాజు పాల్గొన్నారు.

నాసిరకం మద్యంతో ఆరోగ్యాలు నాశనం చేసిన వైసీపీ

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు నాసిరకం మద్యం సరఫరా చేసి డబ్బుతో పాటు వారి ఆరోగ్యాన్ని నాశనం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. ఐదేళ్లపాటు ప్రజలను జలగల్లా పట్టి పీడించి మద్యం,మైనింగ్, ఇళ్ళ స్థలాలు స్కామ్‌లకు పాల్పడ్డారని విమర్శించారు. అప్పుడు టీడీపీ ప్రతిపక్ష పార్టీగా పోరాడితే అక్రమ కేసులతో అణిచివేయాలని చూశారన్నారు. సిట్ దర్యాప్తుతో మద్యం కుంభకోణంలో అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని, ఆ పార్టీ ఎంపీ మిథున్‌రెడ్డితో పాటు అతని వెనకున్న మాజీ సీఎం జగన్‌కు శిక్షపడే రోజులు తొందరలోనే వస్తాయన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి



మృతుడు గోపి (ఫైల్‌ఫొటో)

ఈపూరు, జూలై21(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని భద్రుపాలెం సమీపంలో సోమవారం జరిగింది. రొంపిచర్ల మండలం ఆరేపల్లికి చెందిన గుడిపాటి గోపి(22) మోటార్ బైక్‌పై భద్రుపాలెం వెళ్తుండగా ఎదురుగా ఆటో వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో గోపి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని పోలీసులు అంబులెన్స్‌లో ఈపూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నర్సరావుపేటకు తీసుకువెళ్ళారు. చికిత్స పొందుతూ గోపి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. గోపి ఇంజనీరింగ్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. గుడిపాటి సింగరయ్య,కోటేశ్వరమ్మలకు ఐదుగురు కుమార్తెల తరువాత గోపి పుట్టాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

చెల్లని చెక్కు కేసులో శిక్ష ఖరారు

నరసరావుపేట లీగల్, జూలై 21, (ఆంధ్రజ్యోతి), చెల్లని చెక్కు కేసులో నేరం రుజువు కావడంతో దిగువ కోర్టు విధించిన 18 నెలల కఠిన కారాగార శిక్ష, రూ.25 లక్షలు ఫిర్యాదుకి నష్టపరిహారంగా చెల్లించేలా విధించిన శిక్షను యథాతథంగా ఖరారు చేస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి డాక్టర్ నేతి సత్య శ్రీ సోమవారం తీర్పు వెలువరించారు. పట్టణానికి చెందిన నిందితుడు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు వద్ద 2013 ఫిబ్రవరి 27న రూ.25 లక్షలు అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోటు రాసి ఇచ్చాడు. చెల్లింపులో భాగంగా 2017 మే 5న రూ.25 లక్షల చెక్కును ఇచ్చాడు. నాగేశ్వరరావు చెక్కును తన బ్యాంక్ ఖాతాలో వేసుకోగా అది చెల్లలేదు. ఆయన కోర్టులో కేసు దాఖలు చేసుకున్నాడు. విచారణలో నేరం రుజువడంతో 2021 జనవరి 20న దిగువ కోర్టు కోర్టు పై విధంగా తీర్పును వెలువరించింది. నిందితుడు శ్రీనివాసరావు జిల్లా కోర్టులో అప్పీలు దాఖలు చేసుకున్నాడు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం దిగువ కోర్టు తీర్పును యథాతథాంగా ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది.

గడువిస్తేనే..ధీమా!

(5వ పేజీ తరువాయి)

పత్తి ఎకరాకు రూ.1,900 ప్రీమియం ఈ నెల 31వ తేదీ కల్లా చెల్లించాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ నెలాఖరు వరకు బీమా పొగించడంతో పత్తి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలని వ్యవసాయ శాఖ జేడీ ఎం.జగ్గారావు సూచించారు.

సాగు మొదలు కాని కంది, మిరప

కంది, మిరప పంటలు సాగు చేయలేదు. ఆయా పంటల సాగుపై రైతులకు ఇంకా స్పష్టత లేదు. వచ్చే నెల మొదటి వారంలో సాగర్ కుడి కాల్వకు నీరు విడుదల చేయనున్నారు. పల్నాడులో కంది సాధారణ సాగు విస్తీర్ణం 52,635 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు సాగు చేపట్టలేదని వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. వర్షాలు కొనసాగితే కందిసాగు ఈ నెలాఖరుకు ప్రారంభమయ్యే అవకాశాలు న్నాయి. అగస్టు 15 తర్వాతే మిరప సాగు చేసే అవకాశాలున్నాయి. అయితే.. అప్పటి వరకు బీమా సౌకర్యం లేదు. పంటలు సాగు చేయక ముందే బీమా పథకాల గడువు ముగుస్తుండటం గమనార్హం. జిల్లా యూనిట్‌గా పంటల బీమాను అమలు చేస్తే పంటలు సాగు చేశాక రైతులు బీమా ప్రీమియం చెల్లించే అవకాశం ఉంటుంది. బీమా గడువును ఆగస్టు ఆఖరు వరకు పొడిగించాలని రైతులు కోరుతున్నారు. లేకుంటే బీమా సౌకర్యాన్ని వారు కోల్పోయినట్లే.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	119, 127, 137
చికెన్ విత్ స్కిన్(కిలో)	226.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	236.00

44,971 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 47,858 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 44,971 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,252 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13000
నెంబరు. 5	10000	13400
273	----	----
341	10000	13600
4884	----	---
సూపర్ 10	10000	13000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14000
షార్క్-1	-----	---
బ్యాడిగి	10000	12300
దేవనూరు డీలక్స్	10000	12500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9600	10800
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	12500
నెంబరు. 5	10000	13600
273	9800	12800
341	10000	13500
4884	10000	12700
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13800
బ్యాడిగి	10000	12600
దేవనూరు డీలక్స్	10000	12600
తాలుకాయలు	4500	7000


దుర్గి: కొండవాగు వద్ద నిలిచిపోయిన వాహనాలు

విస్తారంగా వర్షాలు

- పంట పొలాల్లో నిలిచిన నీరు
- ఆర్‌అండ్‌బీ రోడ్లపై ప్రవహిస్తున్న వర్షపు నీరు


మాచవరంలో పత్తి పంటలో నిలిచిన నీరు

మాచవరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): గత నెల రోజులుగా వర్షం కోసం ఎదురు చూస్తున్న అన్నదాతలకు తనివి తీరా వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం నుంచి సుమారు గంటన్నర పాటు ఏకధాటిగా అన్ని గ్రామాల్లో భారీవర్షం కురిసింది. గంగిరెడ్డిపాలెం, మాచవరం, వేమవరం, కొత్తపాలెం, మోర్జంపాడు తదితర గ్రామాల్లో పంటపొలాల్లో నీరు నిలిచింది. రహదారులు జలమయమయ్యాయి. గంగిరెడ్డిపాలెం సమీపంలో రోడ్డుపై వర్షపునీరు పారింది. అన్ని గ్రామాల్లో వర్షం కురవటంతో రైతులు ఆనందం వ్యక్తం చే స్తున్నారు. నెల రోజులుగా వర్షాలు లేక వేసిన విత్తనా లు మొలకెత్తక, మొక్కలు ఎండిపోవటంతో ఇవి తొలగించారు. రెండుమూడు రోజులుగా కురుస్తున్న వర్షా లవల్ల రైతులు అన్ని గ్రామాల్లో పత్తివిత్తనాలను నాటారు.

దాచేపల్లిలో పొంగుతున్న వాగులు

దాచేపల్లి: మూడునెలలుగా వర్షంకోసం ఎదురుచూస్తున్న రైతులకు ఆది, సోమవారాల్లో కురిసిన వానలతో కరువుతీరింది. పంట పొ లాలన్నీ తడిసి ముద్దయ్యాయి. మండలంలోని నా గులేరు, కాట్రేడు వాగు, రాళ్ళవాగు, నల్లవాగు, కంజులవాగులు వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇ ప్పటికే రైతులు దాచేపల్లి మండలంలో రెండు వేల ఎకరాలకు పైగా పత్తి పంటను సాగుచేశారు. వర్షం తెరపిస్తే పూర్తిస్థాయిలో పత్తిపంటను సాగు చేసేందుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. గత రెండు నెలలుగా అదునుకు వర్షం లేకపోవటంతో ఆందోళనలో ఉ న్న రైతులకు ఈ వర్షం సంతోషాన్నిచ్చింది. రామాపురం, భట్రుపాలెం, కాట్రపాడు, సారంగపల్లి అగ్రహారం, కొత్తూరు, మాదినపాడు, పొందుగుల, శ్రీనగర్ గ్రామాల్లో వర్షాధారంగా పంటలను సాగుచేస్తున్నారు.

సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి: సత్తెనపల్లిలో సోమవారం భారీ వర్షం కురిసింది. శనివారం నుంచి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు పారింది. రోడ్లపై జనజీవనానికి ఇబ్బంది కలిగింది. ఎడ తెరిపి లేకుండా వర్షం కురవటం వల్ల పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజ్‌లోకి వర్షపునీరు చేరింది. సబ్ ట్రెజరీ కార్యాలయంలో కూడా వర్షపు నీరు చేరింది. పట్టణంలోని ఏరియా వైద్యశాల వరండాలో కూడా వర్షం నీరు నిలిచింది. కాగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నా రు. వర్షంతగ్గితే పొలం పనులు ఊపందుకోనున్నాయి.

దుర్గి మండలంలో...

దుర్గి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి పొర్లుతున్నాయి. ఓబులేశుని, దుర్గి మధ్యలోని కొండ వాగు తీవ్ర రూపం దాల్చడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దుర్గిలోని బండ్లవాగు పొంగి పొర్లింది. గ్రామాల్లో వీధులు జలమయమయ్యాయి. వర్షంతో రైతుల్లో సాగుపై ఆశలు చిగురించాయి.

గురజాలలో...

గురజాలటౌన్: గురజాల పట్టణంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షానికి పట్టణంలోని ప్రధాన రహదారులు అంతట భారీగా వర్షపు నీరు చేరింది. మండల పరిషత్ కార్యాలయంలోకి వర్షపునీరు చేరింది. అలాగే ముందు భాగంలో వర్షపు నీరు నిలిచింది. రజక వీధిలో వర్షపునీరు రోడ్డుపై పారుతోంది. అలాగే మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి ఎదురు, ఎక్సైజ్ కార్యాలయం చుట్టూ వర్షపునీరు చేరింది. పట్టణంలోని లక్ష్మీటాకీస్ సెంటర్లో, మాడుగుల అడ్డరోడ్డు వద్ద, గుంటూరు - మాచర్ల ప్రధాన రహదారిపైకి నీరు చేరింది. పలు ప్రాంతాలు జలమయమయ్యాయి.

గురజాల - కారంపూడి వాహనాల నిలిపివేత

గురజాల నుంచి కారంపూడి వెళ్లే వాహనాలను నిలిపివేస్తామని ఆర్‌అండ్‌బీ డీఈఈ రమణయ్య, ఏఈఈ షేక్ యూనస్‌లు సోమవారం తెలిపారు. గత రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి గురజాల నుంచి కారంపూడి వెళ్లే రహదారిలో చర్లగుడిపాడు-లక్ష్మీపురం గ్రామాల మధ్యలో ఎర్రవాగు వద్ద రోడ్డులో సగభాగం 6 దోనెలు కూలి ప్రమాదకరంగా ఉంది. గురజాల నుంచి కారంపూడి వెళ్లే వాహనాలు వేరే మార్గం ద్వారా వెళ్లాలని సూచించారు.


గురజాల: మండల పరిషత్ కార్యాలయంలోకి చేరిన వర్షపునీరు

రెంటచింతలలో...

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రెంటచింతలలోని శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయాల వద్ద ఉన్న సీసీ రోడ్లన్నీ మోకాలు లోతులో నీళ్లలో వున్నాయి. పశువైద్యశాల నిండా వర్షపు నీరు చేరింది. ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని కల్వర్టు నిండా జమ్ము, తూటి కాడ పెరగడంతో నీళ్ల వెళ్లేమార్గం లేకుండాపోయింది.

కారంపూడి మండలంలో..

కారంపూడి: పట్టణంలో సోమవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పలు గృహాల్లోకి వర్షపు నీరు చేరింది. గాంధీ బొమ్మ సెంటర్ సచివాలయం-1 వెనుక బజారు మొత్తం ప్రతి ఇంట్లోకి నీళ్లు వెళ్లి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. డ్రైనేజీ వ్యవస్థ చిన్నాభిన్నంగా ఉండడంతో వర్షం పడితే నీళ్లు పొంగి పొర్లుతున్నాయి. రహదారులు వాగులను తలపిస్తున్నాయి.


కారంపూడి: వాగును తలపిస్తున్న వీధి

మాచర్లలో...

మాచర్లటౌన్: మాచర్ల పట్టణంలో సోమవారం భారీ వర్షం పడింది. సాయంత్రం 2 గంటల పాటు ఎడతెరిపి లేకుం డా వర్షం పడిం ది. దీంతో పలు లోతట్టు ప్రాంతా లు జలమయమయ్యాయి. ఎండ తీవ్రతతో అల్లాడిపోయిన పట్టణ వాసులు వర్షంతో సేదతీరారు. రైతు ల మోముల్లోనే సంతోషం వెల్లివిరిస్తోంది. మాచర్ల మండలంలో 65 మి.మీ.లు, దుర్గి మండలంలో 19 మి.మీ.లు, వెల్దుర్తి మండలంలో 1.6 మి.మీ.లు, రెం టచింతల మం డలంలో 38.6 మి.మీలు, కారంపూడి మండలం లో 34.4 మి.మీ.లు వర్షపాతం నమోదైంది.

పిడుగురాళ్లలో..

పిడుగురాళ్ల: పల్నాడు ప్రాంతంలో సో మవారం ఉద యం నుండి వ ర్షం పడుతూనే వుంది. మధ్యాహ్నం తరువాత భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలోని డ్రెయిన్స్ అన్నీ చెత్తాచెదారంతో పేరుకుపోవడం వల్ల వర్షపునీరు అంతా రోడ్లపై ప్రవహించింది. మార్కెట్ యార్డు సమీపంలో వున్న బుగ్గవాగు వర్షం నీటితో పొంగుతోంది.

పొంగి పొర్లుతున్న ఎండ్రాయి వాగు

అమరావతి: అమరావతికి ఎగువ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షం వలన వరదనీరు దిగువకు ప్రవహించడంతో వాగులు పొంగి ప్రవహిస్తూ సమీపంలోని సాగుభూములను నీటముంచింది. ప్రధానంగా సత్తెనపల్లి, మేడికొండూరు మండలాల నుండి వస్తున్న వరద నీటితో మండల పరిధిలోని ఎండ్రాయి-నరుకుళ్లపాడు గ్రామాల మధ్య ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తూ వందలాది ఎకరాలను నీట ముంచింది. దీంతోపాటు అమరావతి-నరుకుళ్లపాడు మధ్య ఉన్న వాగు నిండుగా ప్రవహిస్తుంది. ఎండ్రాయి వాగు ప్రభావంతో పత్తి మొక్కలకు కొంతమేర నష్టం కలిగింది.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: మండలంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్నిరోజులుగా వర్షాలు లేక రైతులు విత్తనాలు వేయలేదు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో రైతులు విత్తనాలు వేశారు. బెల్లంకొండ మెయిన్ సెంటర్ వర్షపు నీటితో నిండిపోయింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బెల్లంకొండ ఎస్టీ కాలనీలోని గృహాల్లోకి వర్షపు నీరు చేరింది. మన్నెసుల్తాన్‌పాలెం వద్ద లోలెవల్ చప్టాపై వర్షపు నీరు పొర్లటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. బెల్లంకొండ తహసీల్దార్ కార్యాలయ ఆవరణ వర్షపు నీటితో నిండిపోయింది.


దాచేపల్లి నాగులేరు బ్రిడ్జిపై కురుస్తున్న వర్షం

క్రోసూరు మండలంలో..

క్రోసూరు: క్రోసూరు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. మండలంలోని హసానాబాద్, నాగవరం, దొడ్లేరు, క్రోసూరు, అనంతవరం, ఊటుకూరు, బయ్యవరంతో సహా పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది.

పెదకూరపాడులో..

పెదకూరపాడు: రెండు రోజులుగా పెదకూరపాడు ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు పొంగి పలు గ్రామాలు నీటి మయమయ్యాయి. మండలంలోని లింగంగుంట్ల, పరస, కంభంపాడు, ముస్సాపురం, పాటిబండ్ల, బలుసుపాడు గ్రామాలకు చెందిన వందలాది ఎకరాలు నీట మునిగాయి. ఈ వర్షానికి పొలాల్లో మొలచిన పత్తిమొక్కలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.


క్రోసూరు: నాలుగు రోడ్ల సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


అమరావతి: ఎండ్రాయి వాగు వరద ముంపుతో చెరువును తలపిస్తున్న సాగుభూములు

సంక్షిప్తం...

- పిడుగురాళ్ల, జూలై 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆషాడమాస సారెను భక్తులు సమర్పించారు. పట్టణంలోని కనకదుర్గమ్మ ఆలయం నుండి ఊరేగింపుగా కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంకు చేరుకున్నారు. సారెను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- గుత్తికొండ గ్రామ పంచాయతీ శివారు ప్రాంతమైన వేమగిరి పూర్తిగా అటవీ ప్రాంతంలో వుందని, 300మంది వేమగిరిలో నివశిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కనీస అవసరాలు తీర్చాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద సోమవారం ఆలిండియా కిసాన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రెడ్ బాషా ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. వారికి పక్కా గృహాలు, రహదారులు, మంచినీటి సౌకర్యం మెరుగుపరచడంతో పాటు సాగు చేసుకుంటున్న అటవీ భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కొత్తపల్లి రమేష్, తంగెడ సుభాని, షేక్ సద్దాం, కోటిరెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- నకరికల్లు: రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ జాబితాల్లో అర్హత ఉన్నా పేర్లు లేని రైతులు ఈనెల 23వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఏవో దేవదాసు కోరారు. రైతులు తమ ఆన్‌లైన్ 1బీ ఆధార్ జిరాక్స్, మొబైల్ నెంబరు, పాసు బుక్ జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు అన్నదాత సుఖీభవ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు తెలుసుకోవచ్చన్నారు.
- సత్తెనపల్లి: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పట్టణంలోని వడ్డవల్లి 16వ వార్డులో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ వార్డు ప్రజలు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతున్నాయని అధికారులు చెపుతున్నారని, వెంటనే మార్చాలని వార్డు ప్రజలు కోరారు.
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం సబ్ జైలులోని ఖైదీలకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఖైదీలకు హెచ్ఐవీ, టీబీ, హెపటైటీస్, సిఫిలిస్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ పీ వెంకటరత్నం, జైలు హెడ్‌వార్డర్ ఎం విశ్వేశ్వరరావు, జయప్రద, ఐసీటీసీ కౌన్సిలర్ రఘునాథ్, ల్యాబ్ టెక్నీషియన్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.
- రాజుపాలెం: రాజుపాలెం పీహెచ్‌సీలో మండలంలోని 20మంది క్షయవ్యాధిగ్రస్థులకు సోమవారం పోషకాహార కిట్స్‌ను డాక్టర్ రవితేజానాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాట్ హైవేస్ ఫౌండేషన్ సహకారంతో పోషకాహార నిమిత్తం ఈ కిట్‌ను అందజేశామన్నారు. కార్యక్రమంలో క్రోసూరు టీబీ యూనిట్ పర్యవేక్షకులు తదితరులు ఉన్నారు.
- సత్తెనపల్లి రూరల్: పత్తిపంట సాగుచేస్తున్న రైతులు పంటల బీమా చేసుకోవాలని ఏవో బీ సుబ్బారెడ్డి అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్తి సాగు చేసే రైతు ఎకరాకు రూ 1900 ప్రీమియం చెల్లిస్తే వాతావారణ ప్రతికూల మార్పులతో పంట నష్టం కలిగితే రూ.38వేల పరిహారం పొందవచ్చని తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకే గడువు ఉందని ఆయన తెలిపారు.
- సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు ఏడీఏగా బీ రవిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన వినుకొండ నుంచి బదిలీపై సత్తెనపల్లి వచ్చారు. ఇక్కడ సత్తెనపల్లి ఇన్‌చార్జ్ ఏడీఏగా ముప్పాళ్ళ ఏవో ఎస్ శ్రీధర్ రెడ్డి వ్యవహరించారు.
- మాచర్లటౌన్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఐటీఐలో 2024-25 సంవత్సరానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 25వ తేదీన ఉదయం 10 గంటలకు పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పవన్‌కుమార్ తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి మార్క్స్ మెమో, టీసీ, స్టడీ, క్యాస్ట్, ఆధార్ ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు దరఖాస్తు, వెరిఫికేషన్ ఫారాలతో హాజరు కావాలన్నారు.
- కారంపూడి: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కారంపూడికి చెందిన సీనియర్ నేత శెట్టి హనుమంతరావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జనసంఘ్ నుంచి కార్యకర్తగా అంచెలంచెలుగా ఎదిగిన హనుమంతురావు నియోజకవర్గం, డివిజన్ స్థాయిల నుంచి జిల్లా స్థాయికి ఎదిగారు.
- పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో సోమవారం వాసవీ జాగృతి క్లబ్ కారంపూడి శాఖ 50మంది లైఫ్ లాంగ్ చార్టెడ్ సభ్యులను ఉమ్మడి గుంటూరు జిల్లా గవర్నర్ రంగా రత్నశ్రీ ఆధ్వర్యాన ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథి వాసవీ జాగృతి అధ్యక్షుడు తిరువీధి వేణుగోపాల్ ఆధ్వర్యాన పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఇన్‌చార్జి తుమ్మల వెంకటసాయి నాగభూషణం, క్యాబినేట్ సెక్రటరీ అన్నవరపు సంచిత, తదితరులు పాల్గొన్నారు.
- రెంటచింతల: రెంటచింతల నుంచి దైద గ్రామానికి వెళ్లడానికి గోట్టిముక్కల మేజర కింద నిర్మించిన దైద బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందని దాని స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డీసీ చైర్మన్ యాగంటి రామారావు కోరారు. సోమవారం టీడీపీ నేత సుమంత్‌రెడ్డితో కలిసి బ్రిడ్జిని పరిశీలించారు.
- రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టిశ్రీరాములు స్మృతివనం ఏర్పాటుకు సీఎం చంద్రబాబు 6.8 ఎకరాల భూమి కేటాయించడం హర్షణీయమని.. ఆర్యవైశ్యులంతా రుణపడి వుంటామని టీడీపీ సీనియర్ నేత నాళం పెదబాబు అన్నారు. సోమవారం రెంటచింతలలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గుండా రామ్మూర్తి, ఏచూరి బుడ్డ, వైవీ సైదయ్య, కొత్త అదీప్, గుండా రాము, కాశీపతి, గోపాలరావు, నేతాజీ, శ్రీనివాసరావు, పల్నూర్తి మల్లి, కొత్త శ్రీను తదితరులు పాల్గొన్నారు.
- అచ్చంపేట: మండలంలోని చల్లగరిగ గ్రామంలో పీ-4 పథకంలో ఎంపికైన బంగారు కుటుంబాల వారికి సోమవారం గ్రామసభ జరిగింది. 79 కుటుంబాలను పీ-4 పథకంలో ఎంపిక చేశారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేద ప్రజలను ఆర్థికంగా వెసులుబాటు కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్టు ఎంపీడీవో కే శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, డీసీ చైర్మమన్ పి.పాపిరెడ్డి, ఏవో రమేష్ పాల్గొన్నారు.
- అమరావతి: ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా సకాలంలో రేషన్ అందుతుందో లేదో తెలుసుకునేందుకు వివిధ రాజకీయపార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, డీలర్లు, అధికారులతో సమావేశాలు నిర్వహించాలని సీపీఎం నాయకులు బీ సూరిబాబు, పలువురు తహసీల్దార్ దానియేలుకు వినతిపత్రం అందజేశారు. ప్రతి మూడు నెలలకు సమావేశాలు నిర్వహించడం వలప రేషన్ లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే అవకాశం ఉంటుందని కోరారు.
- బెల్లంకొండ: బెల్లంకొండ మండలంలోని గంగిరెడ్డిపాలెంలో ఈనెల 23వ తేదీన కాటూరి మెడికల్ కళాశాల హాస్పటల్ సౌజన్యంతో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసినట్టు మండల టీడీపీ నాయకుడు ఆసుల జగన్ తెలిపారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు గంగిరెడ్డిపాలెంలో రంగా బొమ్మ సెంటర్ వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నేత్రపరీక్షలు కూడా చేస్తారన్నారు.
- క్రోసూరు: మండలంలోని అనంతవరంలో సోమవారం వందలాది మహిళలు గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. నీటి బిందెలతో అంకమ్మ తల్లి, గంగమ్మ తల్లి, పోలేరమ్మ తల్లి, సత్తెమ్మతల్లికి అభిషేకాలు జరిపారు. అనంతరం అమ్మవార్లను పూజించారు.
- పెదకూరపాడు: రైతుల పక్షాన ప్రభుత్వమే పంటల బీమా చెల్లించాలని రైతు సంఘం నాయకుడు దర్శి శేషారావు కోరారు. తహసీల్దార్ నీలి ధనలక్ష్మికి సోమవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతు ప్రతినిధులు ఎం మస్తాన్‌రావు, ఆలీ, శ్రీనివాసరావు, శ్రీను, సాంబశివరావు, హరిబాబుపాల్గొన్నారు.


పాకాలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడిగా సత్యనారాయణ, డైరెక్టర్లచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే కన్నా

పాలకవర్గం మంచి పేరు తేవాలి

- పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ అభివృద్ధి, రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాలకవర్గం పనిచేసి సీఎం చంద్రబాబుకు మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని పాకాలపాడు పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పాకాలపాడు పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకలపై నూతన పాలక వర్గం విచారణ జరిపి నిధులు రికవరీ చేయాలని, అవకతవకలకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. చంద్రబాబుతోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధితో పాటు రాజధాని, పోలవరం నిర్మాణం శరవేగంగా జరుగుతుందన్నారు. ముందుగా చైర్మన్ కొనికినేని సత్యనారాయణ, డైరెక్టర్లు అన్నదాసు వెంకట్రామయ్య, పేరం హరిబాబుచే జీడీసీసీబీ మేనేజర్ కోటిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆరుగురు రైతులకు రూ.60లక్షల పంట రుణాల చెక్కులను ఎమ్మెల్యే కన్నా, చైర్మన్ సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డీఎల్‌సీవో అంజమ్మ, సంఘ సీఈవో అన్నదాసు సాయిబాబు, ఆడిటర్లు రజిని, ఎంవీ నరసయ్య, గ్రామ టీడీపీ అధ్యక్షుడు షేక్ నన్నే సాహెబ్, కొఠారు పరబ్రహ్మప్రసాదు, రాయపాటి సుధీర్, కోదారి నరేంద్ర, కోదారి అప్పారావు, సత్తెనపల్లి మండల, నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ చేస్తే క్రిమినల్ కేసులు

నకరికల్లు, జూలై 21(ఆంధ్రజ్యోతి): అనుమతి లేని ప్రాంతాల్లో, ప్రభుత్వ భూముల్లో మైనింగ్ చేసినవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్టు తహసీల్దార్ కే పుల్లారావు హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా కొన్ని గ్రామాల్లో అక్రమ మైనింగ్ జరుగుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని, ఆయా గ్రామాల వీఆర్‌వోలు, విలేజ్ సర్వేయర్లను బాధ్యులుగా చేస్తామని తెలిపారు.

ఆక్రమణ స్థలం సర్వే

దుర్గి, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆలయ స్థలం ఆక్రమణ శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల సర్వేయర్ సాల్మన్‌రాజు, వీఆర్వో వెంకటేశ్వర్లు ఆలయ స్థలాన్ని పరిశీలించి సర్వే జరిపారు. నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

మిదున్‌రెడ్డి అరెస్టు ప్రజాస్వామ్య గెలుపు

పెదకూరపాడు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో ఎంపీ మిదున్‌రెడ్డి అరెస్టు ప్రజాస్వామ్య గెలుపు అని నాయి బ్రాహ్మణ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మద్యం కుంభకోణం కేసులో వైసీపీ నేతలను అరెస్టు చేయటం ప్రజాస్వామ్యానికి నిదర్శనమన్నారు. జగన్‌రెడ్డి అధికారాన్ని అడ్డు పెట్టుకొని నాసిరకం మద్యం అమ్మించి ఐదు సంవత్సరాల్లో రూ 30వేల కోట్లు దోచేశారన్నారు. కల్తీ మద్యం వల్ల వందలాది మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ స్కామ్‌లో పాలుపంచుకున్న ప్రతిఒక్కరు ఊచలు లెక్కించక తప్పదన్నారు.

పెదమద్దూరు వాగు వద్ద వాహనాల రాకపోకల నిలిపివేత

అమరావతి, జూలై 21(ఆంధ్రజ్యోతి) భారీ వర్షాల వలన వాగులు పొంగి ప్రవహిస్తుండటంతో అమరావతి-విజయవాడ రహదారిలోని పెదమద్దూరు వాగు చప్టాపై వాహనాల రాకపోకలను రెవెన్యూ, పోలీసు అధికారులు నిలిపివేశారు. సోమవారం సాయంత్రం వాగుపై వరదనీరు పెరిగే అవకాశం ఉన్నందున తహసీల్దార్ దానియేలు, సీఐ అచ్చియ్య, ఎస్ఐ రాజశేఖర్, ఆర్ఐ శిరోమణిలు ముందస్తుగా వాహనాల రాకపోకలు నిలిపివేసి సిబ్బందిని కాపలా ఉంచారు. దీంతో విజయవాడ-అమరావతి మధ్య నడిచే బస్సు సర్వీసులు ఆగిపోనున్నాయి.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 568.30 అడుగులు ఉంది. ఇది 252.30 టీఎంసీలకు సమానం. ఎడమ కాలువ ద్వారా 2818 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 4618 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 67,551 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల...

అచ్చంపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 10.09 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 8,650 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద లీకుల ద్వారా 400 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

సమయానికి తెరుచుకోని ప్రభుత్వ కార్యాలయాలు


ఉదయం 11:30 గంటలకు కూడా తెరుచుకోని వెలుగు కార్యాలయం

కారంపూడి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలోని పలు ప్రభుత్వ కార్యాలయానికి నిర్దేశిత సమయానికి తెరుచుకోలేదు. సోమవారం ఉదయం 11 గంటలు అవుతున్నా గ్రామ సచివాలయం తాళాలు వేసే ఉన్నాయి. అలాగే 11:30 గంటలకు కూడా వెలుగు కార్యాలయం తాళాలు తీయనేలేదు. ప్రజలు అధికారులు కోసం గంటల తరబడి వేచిచూడాల్సిన దుస్థితి ఏర్పడింది.



ఉదయం 11 గంటలకు కూడా తెరుచుకోని సచివాలయం

కండ్లకుంటలో ఎమ్మెల్యే జూలకంటి పర్యటన

మాచర్లటౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం కండ్లకుంటలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సోమవారం పర్యటించారు. మోడల్ స్కూల్‌ను సందర్శించి మౌలిక వసతులు, విద్యాబోధన అంశాలను స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ పాండురంగారావును అడిగి తెలుసుకున్నారు. స్కూల్ ప్రాంగణం, తరగతి గదులను పరిశీలించారు. తాగునీరు, విద్యుత్ ఇబ్బందులపై ఆరా తీశారు. వసతిగృహం ఏర్పాటుకు కావాల్సిన వసతులు, నిధులు గురించి ఏపీ మోడల్ స్కూల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవానందరెడ్డితో మాట్లాడి త్వరలో నిధులు కేటాయించి వసతిగృహానికి తాగునీరు, విద్యుత్, ప్రహరీ, సోలార్ ఫెన్సింగ్ వంటివి నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జూలకంటి అక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మోడల్ స్కూల్ సందర్శనలో ఎమ్మెల్యే జూలకంటి

ప్రజలకు చేరువైన అభివృద్ధి, సంక్షేమం

- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

క్రోసూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు చేరవయ్యాయని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం మండలంలోని విప్పర్లలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సమస్యలను అడిగి మై టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అందుతున్నాయా?, లేదా? విచారించారు. ఏడాది పాలనలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు ప్రయోజనం చేకూర్చామన్నారు.ఎస్సీ కాలనీ, గోవిందాపురం కాలనీ, విప్పర్ల గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి వేగుంట రాణి, కొండవీటి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు చెరుకూరి నాగేశ్వరరావు, మొగల్ జాన్, షేక్ సలాం, దుద్దుల యోహాన్, బండారు మైనూర్‌బాబు పాల్గొన్నారు.

నోరు అదుపులో పెట్టుకో అంబటి...

రాజుపాలెం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆంబోతు రంకెలు మానుకుని నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని మాజీ మంత్రి అంబటి రాంబాబును టీడీపీ మండల అధ్యక్షుడు అంచుల నరసింహారావు హెచ్చరించారు. సోమవారం రాజుపాలెంలో విలేకర్ల సమావేశం ఆయన మాట్లాడుతూ సీనియర్ నాయకుడు, మంత్రి పదవులకు వన్నెతెచ్చిన నేత ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అని చెప్పారు. జగన్ మెప్పు కోసం మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామన్నారు. ఎమ్మెల్యే కన్నాకు పదవుల గురించి చేప్పేస్థాయి అంబటికి లేదన్నారు. అంబటి మంత్రిగా ఉన్న సమయంలో మండాలనికి ఒక బ్రోకర్‌ను పెట్టుకుని రాజకీయ వ్యాపారం చేశాడని మండిపడ్డారు. సమావేశంలో టీడీపీ మండల నాయకులు ఉన్నారు.

ముున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

పిడుగురాళ్ల, జూలై 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం 9వ రోజు ఐలాండ్ సెంటర్ నుండి ప్రధాన వీధులలో కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. రాష్ట్రంలో పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని, కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శన కొనసాగించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తెలగపల్లి శ్రీనివాసరావు, మధుబాబు, రత్నకుమార్, నాగూర్, నాగేశ్వరరావు, రమేష్, తిరుపతిరావు, విజయకుమార్, కుంబా కొండలు, కృష్ణవేణి, అనంతలక్ష్మీ, మార్తమ్మ, మేరమ్మ, వీరమ్మ, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి సూపర్‌వైజర్ నాగమణి, వెంకటలక్ష్మీలకు సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు వినతిపత్రం అందజేశారు.


పిడుగురాళ్లలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పెన్షన్ వ్యాలిడేషన్ అమెండ్‌మెంట్ బిల్లును రద్దు చేయాలి

- పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణారావు

మాచర్ల రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో పాస్ చేయించిన పెన్షన్ వ్యాలిడేషన్ అమెండ్‌మెంట్ బిల్లును వెంటనే రద్దు చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని పెన్షనర్స్ హోంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అధ్యక్షుడు వెంకటరెడ్డి, ప్రధానకార్యదర్శి చంద్రయ్య, ట్రెజరర్ గాలిబు, సహాయ కార్యదర్శి గౌస్ మొహిద్దీన్, సుబ్బారావు, రామారావు, నారాయణ, మాబు, రాయపరెడ్డి, జగన్నాథాచార్యులు, అంజయ్య, కిరీటిరెడ్డి, భాస్కరబాబు, నాగార్జునరాజు, కోటయ్య, ఎలిజబెత్ రాణి, శివపార్వ తి, కోటేశ్వరరావు, యేసుపాదం పాల్గొన్నారు.

ఆరోగ్యం పైనే శ్రద్ధ..!

● రసాయనాలు లేకుండా పండ్లు, కూరగాయల సాగు ● ఇంటికి సరిపడా ఆహారంతో పాటు.. శారీరక శ్రమ ● గ్రూపులుగా.. 250కి పైగా టెర్రస్ గార్డెన్స్

తెనాలి పట్టణంలో విస్తరిస్తున్న మిద్దె తోటలు



కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న పట్టణాల్లో ఇళ్ల దగ్గర కాస్తంత స్థలం కూడా కానరావడం లేదు. ఉన్న స్థలమంతా ఇంటి నిర్మాణానికే సరిపోతోంది. ఇక మొక్కలకు చోటు ఎక్కడుందని దిగులు పడే వారికి మిద్దె తోటలు దారి చూపుతున్నాయి. తెనాలి పట్టణంలో దాబాలపై గార్డెన్లు పెంచే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మిద్దె తోటలను 250 మందికి పైగా పెంచుతున్నారు.



టెర్రస్ గార్డెన్‌లో పెంచుకుంటున్న వివిధ రకాల మొక్కలు

తెనాలి అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): దాబాలపై కుండీలు పెట్టి వాటిలో రకరకాల మొక్కలను పెంచుతున్నారు. ఇంటిలోకి కావాల్సిన కూరగాయలు, ఆకు కూరలు, పూలు, పండ్లు సమకూర్చుకుంటున్నారు. సేంద్రియ ఎరువుతోనే వీటిని పెంచుతూ.. శారీరక శ్రమ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

గ్రూపులుగా ఏర్పడి..

హైదరాబాద్‌లో 2015లో ప్రారంభమైన మిద్దె తోటల సాగు క్రమేణా అన్ని ప్రాంతాలకు విస్తరించింది. తెనాలి పట్టణంలోని రామలింగేశ్వర పేటకు చెందిన సూర్యదేవర కృష్ణదేవ్, మరికొంత మంది మిద్దె తోటలకు శ్రీకారం చుట్టారు. సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ పేరిట గ్రూపులు ఏర్పాటు చేసుకుని.. ఒకరి అనుభవాలను మరొకరు పంచుకుంటూ ముందుకు వెళ్తున్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో చాలామంది ఏ పని లేకపోవడంతో మిద్దె తోటల పెంపకంపై దృష్టి సారించారు. పట్టణంతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో మిద్దె తోటలు పెంచే వారందరూ గ్రూపులుగా ఏర్పడ్డారు. సుమారు 80 వేల మంది టెర్రస్ గార్డెన్ సాగు చేస్తున్నారు. ఆక్సిజన్ అధికంగా అందించే స్నేక్ ప్లాంట్, అగ్లోనిమా, పీస్ లిల్లీ, జేడ్ వంటి మొక్కలు, రెండేళ్లలో కాపునకు వచ్చే పండ్ల మొక్కలు జామ, మామిడి, చెరకు, అంజురా, బార్బడో, సపోటా, ఇంటికి రోజు సరిపడా ఆకు కూరలు, బెండ, వంగ, చిక్కుడు వంటి కూరగాయల మొక్కలు సాగు చేస్తున్నారు.



మిద్దె తోటలో మొక్కలతో సూర్యదేవర కృష్ణదేవ్

రసాయనాలు లేకుండా..

మొక్కలను అంటుకట్టి వివిధ రకాల పద్ధతుల్లో నూతన మొక్కలను కూడా గ్రాఫ్టింగ్ చేస్తున్నారు. వీటికి వచ్చే తెగుళ్లను రసాయనిక మందులతో కాకుండా ఇళ్లలో ఉండే మజ్జిగ, వెల్లుల్లి పేస్ట్, ఇంగువ, పసుపుతో చేసిన ద్రావణాలు పిచికారీ చేసి తెగుళ్లు, పురుగులను అరికడుతున్నారు. రోజు గంట పాటు కేటాయించి శారీరక శ్రమ పొందుతున్న వీరికి మరో వ్యాయామం పని లేకుండా ఆరోగ్యం లభిస్తుంది. మొక్కల్లో మొదట వచ్చిన కాపును విత్తనాలుగా తీసి మరికొందరికి ఉచితంగా అందజేస్తున్నారు. ప్రతిరోజు వారి ఇళ్లల్లో దిగుబడి వచ్చిన కూరగాయలు, ఆకు కూరలను వాట్సాప్ గ్రూపుల్లో ఇస్తున్నారు. ఇటీవల కడప పట్టణంలో మిద్దె తోటను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా పరిశీలించి అన్ని ప్రాంతాల్లో ప్రోత్సహించాలని సూచించారు. మనం తినే ఆహారం అత్యంత నాణ్యంగా.. మన ఇంటిపైనే పండించుకోవచ్చని మిద్దె తోటల పెంపకందారులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రీఎన్ఐ, ఎన్ఐ వర్కులతో

పలు రైళ్ల రద్దు

● కొన్ని పాక్షిక్ష రద్దు, దారి మళ్లింపు, క్రమబద్ధీకరణ

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పెదవడ్లపూడి - దుగ్గిరాల - తెనాలి - చుండూరు రైల్వే సెక్షన్‌లో మూడో రైలుమార్గం ప్రీఎన్ఐ, ఎన్ఐ వర్కులు కారణంగా ఈ నెలలో వారం, వచ్చే నెలలో రెండు వారాల పాటు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ నెల 23 నుంచి 29, ఆగస్టు 6 నుంచి 24వ తేదీ వరకు నంబరు. 67213 విజయవాడ - తెనాలి, 67214 తెనాలి - విజయవాడ, ఈ నెల 28, 29, ఆగస్టు 6 నుంచి 24వ తేదీ వరకు నంబరు. 67229 విజయవాడ - గుంటూరు, 67223 గఉంటూరు - రేపల్లె, 67224 రేపల్లె - తెనాలి, 67222 తెనాలి - విజయవాడ రైళ్లను రద్దు చేసినట్లు సీపీఆర్‌వో ఏ శ్రీధర్ సోమవారం తెలిపారు. ఆగస్టు 8 నుంచి 24వ తేదీ వరకు నంబరు. 67221 విజయవాడ - తెనాలి, 67231 తెనాలి - రేపల్లె, 67232 రేపల్లె - తెనాలి, 67233 తెనాలి - రేపల్లె, 67234 రేపల్లె - గుంటూరు, 67235 గుంటూరు - తెనాలి, 67237 తెనాలి - రేపల్లె రద్దు చేశామన్నారు. ఆగస్టు 9 నుంచి 25వ తేదీ వరకు 67238 రేపల్లె - మార్కాపురం, 67239 మార్కాపురం - తెనాలి, 67236 తెనాలి - గుంటూరు, 67230 గుంటూరు - విజయవాడ రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 12 నుంచి 19వ తేదీ వరకు 67249 గుంటూరు రేపల్లె, 67250 రేపల్లె - గుంటూరు రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు.

రెండు రోజుల పాటు నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

ఆగస్టు 17, 18 తేదీల్లో నంబరు. 12733 తిరుపతి - లింగంపల్లి, ఆగస్టు 18, 19 తేదీల్లో 12734 లింగంపల్లి - తిరుపతి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేశామన్నారు. అలానే నంబరు. 22708 తిరుపతి - విశాఖపట్టణం డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 13, 15, 17, నంబరు. 22707 విశాఖపట్టణం - తిరుపతి డబుల్ డెక్కర్‌ని ఆగస్టు 14, 16, 18 తేదీల్లో రద్దు చేశామన్నారు.

రేపల్లె, డెల్టా ఎక్స్‌ప్రెస్‌ల పాక్షిక రద్దు

నంబరు. 17625 కాచీగూడ - రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 11 నుంచి 18వ తేదీ వరకు గుంటూరు వరకే నడిపి గుంటూరు - రేపల్లె మధ్యన రద్దు చేస్తున్నారు. ఈ కారణంగా నంబరు. 17626 రేపల్లె - వికారాబాద్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 12 నుంచి 19వ తేదీ వరకు రేపల్లె నుంచి కాకుండా గుంటూరు నుంచి వికారాబాద్‌కు బయలుదేరుతుంది. అలానే నంబరు. 17646 రేపల్లె - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 12 నుంచి 19వ తేదీ మధ్యన రేపల్లె నుంచి కాకుండా గుంటూరు నుంచి బయలుదేరుతుంది. నంబరు. 17645 చర్లపల్లి - రేపల్లె ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 12 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు వరకే ప్రయాణించి ఆగిపోతుందన్నారు.

51 రైళ్లు న్యూగుంటూరు మీదగా మళ్లింపు

విజయవాడ - తెనాలి మార్గంలో ప్రయాణించే 51 రైళ్లను న్యూగుంటూరు రైల్వేస్టేషన్ మీదగా మళ్లించనున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. కృష్ణాకెనాల్ - న్యూగుంటూరు మీదగా తెనాలికి మళ్లించి అక్కడి నుంచి రెగ్యులర్ రూట్‌లో నడుపుతామన్నారు. అలానే చెన్నై వైపు నుంచి వచ్చే రైళ్లను తెనాలి నుంచి న్యూగుంటూరు, కృష్ణాకెనాల్ మీదగా విజయవాడకు మళ్లిస్తామన్నారు.

వందేభారత్, జన్మభూమి మంగళగిరి మీదగా మళ్లింపు

నంబరు. 12805 విశాఖపట్టణం - లింగంపల్లి, నంబరు. 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లను ఆగస్టు 9 నుంచి 19వ తేదీ మధ్యన మంగళగిరి మీదగా మళ్లించనున్నట్లు సీపీఆర్‌వో పేర్కొన్నారు. నంబరు. 20702 తిరుపతి - సికింద్రాబాద్, నంబరు. 20701 సికింద్రాబాద్ - తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను ఆగస్టు 17, 18 తేదీల్లో మంగళగిరి మార్గంలో మళ్లిస్తామన్నారు. రంబకె, 17229 తిరువనంతపురం - సికింద్రాబాద్ శబరి ఎక్స్‌ప్రెస్‌ని తెనాలి నుంచి విజయవాడ, కాజీపేట, పగిడిపల్లి మీదగా సికింద్రాబాద్‌కు మళ్లిస్తామన్నారు. ఆగస్టు 18వ తేదీన నంబరు. 17230 సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్‌ని పగిడిపల్లి నుంచి కాజీపేట, విజయవాడ, తెనాలి మీదగా దారి మళ్లించి నడుపుతామన్నారు. నంబరు. 16032 కాత్రా - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 16న విజయవాడ - తెనాలి మీదగా, నంబరు. 16031 చెన్నై సెంట్రల్ - కాత్రా రైలుని ఆగస్టు 17న తెనాలి - విజయవాడ మీదగా మళ్లిస్తామన్నారు. నంబరు. 12077 చెన్నై సెంట్రల్ - విజయవాడ, నంబరు. 12078 విజయవాడ - చెన్నై సెంట్రల్ జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 13 నుంచి 18వ తేదీ వరకు న్యూగుంటూరు మీదగా కాకుండా కృష్ణా కెనాల్ నుంచి నేరుగా తెనాలి మార్గంలో నడపడం జరుగుతుందన్నారు. నంబరు. 12603 చెన్నై సెంట్రల్ - చర్లపల్లి చెన్నై ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 17, 18, 19 తేదీల్లో, నంబరు. 12604 చర్లపల్లి - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 18, 19, 20 తేదీల్లో కాజీపేట మార్గంలో మళ్లిస్తామన్నారు. నంబరు. 07193 హైదరాబాద్ - కొల్లం స్పెషల్ రైలుని ఆగస్టు 9, 16, నంబరు. 07194 కొల్లం - హైద రాబాద్ స్పెషల్‌ని ఆగస్టు 11, 18 తేదీల్లో కాజీపేట మార్గంలో మళ్లిస్తామన్నారు. నంబరు. 16093 చెన్నై సెంట్రల్ - లక్నో అండమాన్ ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 19వ తేదీన 180 నిమిషాల పాటు రీషెడ్యూల్ చేయడం జరుగుతుందన్నారు.

కడలి గర్భశోకం

- కలుషితమవుతున్న సముద్ర జలాలు
- మృత్యువాత పడుతున్న తాబేళ్లు, డాల్ఫిన్లు
- కాలుష్య కోరల్లో తీర ప్రాంతాలు
- పర్యావరణ పరిక్షణను పట్టించుకోని అధికారులు





లంకెవానిదిబ్బ సముద్రసమీపంలో మృత్యువాతపడ్డ తాబేలు

రేపల్లె, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సముద్ర జలాలు కలుషితమవుతున్నాయి. దీంతో జీవరాశులు అంతరించి పోవడమేగాక తీర ప్రాంతం కాలుష్య కోరల్లో చిక్కుకుపోతోంది. పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలగడంతో తాబేళ్లు, డాల్ఫిన్స్ మృతి చెందుతున్నాయి. రేపల్లె మండలంలోని లంకెవానిదిబ్బ, ఏలిచెట్లదిబ్బ తీర ప్రాంతాలకు మృతి చెందిన తాబేళ్లు, డాల్ఫి న్స్ కొట్టుకురావడంలో ఆందోళన కలిగిస్తోంది.

వ్యర్థాలతో అనర్థం..

ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థ పదార్థాలను సముద్రం లోకి వదిలేయడంతో జలాలు కలుషితమై.. జీవరాశులు చనిపోతున్నాయి. సముద్ర జలా లు, పర్యావరణాన్ని పరిరక్షించే అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. ఇక్కడ నది, సముద్రం కలిసే ప్రాంతం కావడంతో ఎక్కు వగా డాల్ఫిన్‌లు ఉన్నాయి. సుమారు రెండు టన్నుల బరువు ఉండే డాల్ఫిన్ చేపలు మృతి చెంది ఒడ్డుకు వస్తున్నాయి. వీటిని వేటను మత్స్యశాఖ నిషేధించింది. కృష్ణా జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాల్లో కేర్న్ ఇండియా, రిలయన్స్ సంస్థలు ఆయిల్ కోసం తవ్వకాలు జరుపుతున్నాయి. దీంతో క్రూడ్ ఆయిల్ తెట్టలు తెట్టలుగా సముంద్రంలో కలుస్తోంది. దీంతో సముద్ర జలాలు కలుషితమై చేపలు, తాబేళ్లు, డాల్ఫిన్స్ మృతి చెందుతున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు. ఇప్పటికైనా దీనిపై అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



లంకెవానిదిబ్బ సముద్రం ఒడ్డుకు కొట్టుకువచ్చిన మృతిచెందిన డాల్ఫిన్

తాబేళ్లతో సముద్ర జలాల శుద్ధి

ఆలివ్‌రెడ్‌లే తాబేళ్ల పాచి, మొక్కలు, వివిధ రకాల వ్యర్థ పదార్థాలను తింటూ సముద్ర జీవులకు ఉపకారం చేస్తాయి. సముద్రంలో ఆక్సిజన్‌ను పెంచేందుకు దోహద పడతాయి.

- అడ్డదిడ్డంగా ఉన్న నాచును తినడం వల్ల.. నాచు ఒక బెడ్‌లా ఏర్పడుతుంది. సముద్రం లోని జీవరాశులు ఈ బెడ్‌లో గుడ్లు పెట్టి సంతాన ఉత్పత్తిని పెంచుకునేందుకు ఉపయోగపడుతుంది.
- తాబేళ్లు గుడ్లు పెట్టే సమయంలో ఒక రకమైన జల్ విడుదల చేస్తాయి. ఆ జల్ భూమిలో బంకలా అతుక్కుపోయి తీర ప్రాంతం కోతలకు గురి కాకుండా నివారణకు ఉపయోగపడుతుంది. ఒక్కో తాబేలు మూడు నుంచి ఐదు కేజీల జెల్ వస్తుంది.
- తక్కువగా శ్వాస తీసుకోవడం వల్ల ఆలివ్‌రెడ్‌లే తాబేళ్లు 300 నుంచి 400 సంవత్సరాల వరకు జీవించగలుగుతాయి. సముద్ర జలాలు శుద్ధి చేయడం వల్ల తీర ప్రాంతంలో నివశించే ప్రజలు గాలిపాటుకు అంటువ్యాధుల బారిన పడకుండా ఉపయోగపడుతుంది.
- తాబేళ్లను చంపినా, గుడ్లను తిన్నా భారత వన్యప్రాణి చట్టం 1972 కింద నేరంగా పరిగణిస్తారు.

అమ్మ, నాన్న.. ఓ నకిలీ దత్త పుత్రిక!

● ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్‌తో ఆస్తి కొట్టేసే ప్రయత్నం? ● రెవెన్యూ అధికారులకు బాధితుడి ఫిర్యాదు



తెనాలి తహసీల్దార్‌కు తన ఆవేదనను వివరిస్తున్న బాధితుడు ఉమామహేశ్వరరావు

తెనాలి, జూలై 21, (ఆంధ్రజ్యోతి): సంతానం లేకపోయినా.. ఆయన ఆస్తికి వారసురాలిని చేశారు. తన భార్య కానీ, తాను కాని ఎవరినీ దత్తత తీసుకోపోయినా.. తమకు ఓ దత్తత కుమార్తె ఉందని రెవెన్యూ అధికారులు ధ్రువపత్రం సృష్టించారని.. తన యావదాస్తిపై సర్వ హక్కులు కల్పిస్తూ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కూడా ఇచ్చేశారని ఓ వ్యక్తి సోమవారం రెవెన్యూ అధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు.. గుంటూరు కలెక్టర్‌లో తెనాలి తహసీల్దార్‌కు అర్జీలు అందజేశారు. ఫిర్యాదు దారు చెప్పిన మేరకు.. చేబ్రోలు మండలం వేజండ్లకు చెందిన నన్నపనేని లక్ష్మీ నాగేంద్రం అనే మహిళను వెలగా ఉమామహేశ్వరరావు 1991లో రెండో వివాహం చేసుకున్నారు. అదే గ్రామంలో కలసి ఉంటున్నారు. లక్ష్మీ నాగేంద్రం 2021లో మరణించారు. వారికి సంతానం లేరు. ఆమె చనిపోయాక ఒక మహిళ తన భార్య మొదటి భర్త ఉన్న సమయంలో ఆమెను దత్తత తీసుకున్నారని.. నకిలీ ధ్రువపత్రాన్ని సృష్టించిందని బాధితుడు వాపోయాడు. దాని ద్వారా ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ కుటుంబం ఉండేది చేబ్రోలు మండలంలో అయితే.. తెనాలిలో ఎందుకు ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ ఇచ్చారని ప్రశ్నను లేవనెత్తారు. పైగా సర్టిఫికెట్‌లో తన పేరును అసలు ప్రస్తావించకుండా.. ఆమె ఒక్కరి పేరుపై సర్టిఫికెట్ ఎలా ఇస్తారని అభ్యంతరం వ్యక్తం చేశారు. తెనాలిలో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఉన్న మహిళ.. ఆమెతో ముందే బేరం మాట్లాడుకుని సర్టిఫికెట్ పొందారనే అనుమానం వ్యక్తం చేశారు. లేకపోతే వేజండ్లకు చెందిన కుటుంబానికి.. తెనాలిలో ఏ విచారణ లేకుండా సర్టిఫికెట్ ఎలా మంజూరు చేస్తారని నిలదీశారు. తన ఆధార్, తన భార్య ఆధార్ వేజెండ్ల అడ్రస్‌లోనే ఉన్నాయని, అన్ని ఆధారాలు చేబ్రోలు మండలంలో ఉంటే, తెనాలిలో ఇచ్చిన సర్టిఫికెట్ ఎట్లా చెల్లుబాటవుతుందనేది అతని సందేహం. దీనిపై పూర్తి విచారణ జరిపించాలని, అప్పటి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు రూ.లక్షల్లో లంచం ముట్టిందనే ఆరోపణలు చేశారు. దీనిపై పూర్తి విచారణ జరిపించాలని కోరారు. దత్తత పేరుతో కొందరు తన భార్య ఆస్తిని కొట్టేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణ వివరణ కోరగా.. ఇటీవలే కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయన పెట్టుకున్న అర్జీ వచ్చిందని, మరోసారి తమ కార్యాలయంలోనూ అందించారని తెలిపారు. దీనిపై ఇప్పటికే విచారణ చేస్తున్నామని, త్వరలో విచారించి అసలు విషయం తేలుస్తామన్నారు.

పదిమందికి ఎస్ఐలుగా..

ఉద్యోగోన్నతి

● జిల్లాలు కేటాయిస్తూ ఐజీ ఆదేశాలు

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లాలో పది మందికి ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఐజీ త్రిపాఠి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారికి జిల్లాలు కూడా కేటాయించారు. ఉద్యోగోన్నతి పొందిన వారిలో ఎన్.రవికుమార్, కె.సుభాషిని, ఎస్.చంద్ర లీల, షేక్ యాస్మిన్, ఎల్.చిరంజీవి, ఎం అంజిరెడ్డి తదితరులను గుంటూరు జిల్లాకు కేటాయించారు. ఎల్.లక్ష్మీరాజ్యం, జి వాణిశ్రీని బాపట్ల



ఐజీ త్రిపాఠిని కలిసిన ఉద్యోగోన్నతి పొందిన ఎస్ఐలు

జిల్లాకు, డి.దస్తగిరి, ఎస్.నాగేశ్వరరావును పల్నాడు జిల్లాకు కేటాయించారు. ఉద్యోగోన్నతి పొందిన ఎస్ఐలు సోమవారం రేంజ్ ఐజీ త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఉద్యోగోన్నతి పొందడం అంటే బాధ్యత పెరిగినట్లుగా భావించాలన్నారు. ఇకనుంచి మరింత బాధ్యతగా అంకితభావంతో విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

సాంస్కృతిక వికాసానికి

పునరంకితం కావాలి

సినీ రంగస్థల నటుడు, దర్శకుడు కేఎస్‌టీ సాయి

బాపట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతికళాకారుడు సాంస్కృతిక వికాసానికి పునరంకితం కావాలని సినీ రంగ స్థల నటులు, దర్శకులు కేఎస్‌టీ సాయి పిలుపునిచ్చారు. పట్టణంలోని జీఎస్ఎన్ టవర్స్ నందు సోమవారం బాపట్ల జిల్లా రచయితల సంఘం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో సాయి మాట్లాడుతూ సాహిత్య, సాంస్కృతిక రంగాలలో ఉభయ తెలుగురాష్ట్రాలకే తలమానికమైన బాపట్ల సాంస్కృతిక రంగ పునర్ వైభవానికి కలిసి కట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కళాకారులకు జన్మనివ్వటమేకాక పలువురికి ప్రేరణ ఇచ్చి వారిని ఉత్తమకళాకారులుగా తీర్చిదిద్దిన రంగస్థల కళాశాలగా బాపట్లకు దేశ,విదేశాలలో చిరస్మరణీయమైన పేరు ఉందన్నారు. యువకళాకారులకు శిక్షణ ఇచ్చేందుకు తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుదీర్ఘమైన తన రంగస్థల అనుభవాలను కళాకారులతో ఆయన పంచుకున్నారు. కార్యక్రమానికి రచయిత తిమ్మర శ్యామ్‌సుందర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పెనుమెత్స నాగరాజు, గుండ్రెడ్డి సత్యనారాయణ, ఆకురాతి మురళీకృష్ణ, అంబటి మురళీకృష్ణ, నందిరాజు విజయ్‌కుమార్, సీతారాం, కళ్ళంహరినాథరెడ్డి, సుబ్రహ్మణ్యం, బురుగుల సంగమేశ్వరశాస్త్రి,జీ శాంతారాం, డబ్ల్యుఎజికె.మూర్తి, షేక్.బాబావలి తదితరులు పాల్గొని బాపట్లకు చెందిన సాహిత్య, సామాజిక సంస్థలు గురించి వివరించారు.అనంతరం కేఎస్‌టీ సాయిని ఘనంగా సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేఎస్‌టీ సాయి

సమగ్ర భూసార రక్షణ ఎంతో ముఖ్యం

కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గుంటూరు, 21 జూలై(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో సమగ్ర భూసార సంరక్షణ ఎంతో ముఖ్యమని గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. ఇందుకు సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు (బయో ఫెర్టిలైజర్స్) ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నా యన్నారు. జీవన ఎరువుల వాడకం, నిరంతరం ఆదాయం వచ్చే పంటల విధానం, వరి ఏ గ్రేడ్ నమూ నాలపై వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రచార పోస్టర్ల ను జిల్లా కలెక్టర్, జేసీ ఎ.భార్గవ్ తేజతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మంది రంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకు మారి, డీఆర్వో ఎన్.ఎస్.కే.ఎస్ ఖాజావలి, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర రావు పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ పొడి రూపంలో లభ్యమవుతున్న జీవన ఎరువుల కన్నా ద్రవ రూపంలో జీవన ఎరువులు ఎక్కువ కాలం నిల్వ ఉండి.. మెరుగ్గా పనిచేస్తాయన్నారు. జీవన ఎరువులు లాంఫాంలోని ఏరువాక కేంద్రం, అమరావతిలోని జీవన ఎరువుల పరిశోధన కేంద్రంలో లభ్యమవుతాయని తెలిపారు. జడ్పీ సీఈఓ జ్యోతిబసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



జీవన ఎరువులు వాడకంపై వ్యవసాయ శాఖ రూపొందించిన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

పల్నాడు వార్తలు


◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పత్తి, మిర్చికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ పీ అరుణ్‌బాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల ధరలు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రైవేటు డీలర్ల అక్రమాలపై చర్యలు తీసుకోవాలన్నారు. పీ4 గ్రామ సభలలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు తప్పనిసరిగా పాల్గొని బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల వివరాలను ధ్రువీకరించాలన్నారు. దీపం పథకం నగదు బ్యాంకు ఖాతాల్లో జమకాని వారి సాంకేతిక సమస్యలు పరిష్కరించాలన్నారు. రేషన్ షాపుల పనితీరును మెరుగుపరచాలన్నారు.

పెట్రోల్ దాడిలో గాయపడిన వ్యక్తి మృతి



నీలబోయిన పెద శ్రీను (ఫైల్ ఫొటో)

నూజెండ్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16వ తేదీన పెట్రోల్ పోసి నిప్పంటించగా గాయపడిన నీలబోయిన పెద శ్రీను (60) గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు ఐనవోలు ఎస్ఐ బీవీ కృష్ణారావు తెలిపారు. మండలంలోని ఐనవోలులో ఈ నెల 16వ తేదీన ఆరు బయట నిద్రిస్తున్న దంపతులపై పెట్రోల్ పోసి తగలబెట్టిన సంఘటనలో నీలబోయిన మంగమ్మ అదేరోజు మృతి చెందింది. దాడికి పాల్పడిన నీలబోయిన యలమందను పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించిన విషయం పాఠకులకు విదితమే. పెట్రోల్ దాడిలో భార్యాభర్తలిద్దరు చనిపోవటంతో గ్రామంలో విషాదం నెలకొంది.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

బొల్లాపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామ్‌పురం తండాలో విద్యుదాఘాతంతో వడితే లక్ష్మీబాయి(37) అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మీబాయి ఉదయం ఇంట్లో వంట చేస్తున్న సమయంలో గ్రైండర్ స్విచ్ ఆన్ చేయగా లక్ష్మీబాయి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఆమెకు ముగ్గురు పిల్లలు, భర్త నీమా నాయక్ ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. లక్ష్మీ బాయి మృతదేహాన్ని టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, గోవిందు నాయక్, ఎం హనుమా నాయక్, వాసు నాయక్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

పచ్చిరొట్టె పంటలతో భూసారం పెరుగుతుంది: ఏడీఏ శివకుమారి

నరసరావుపేట రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంట పొలాల్లో పచ్చిరొట్టె పంటలను సాగుచేసి భూమిలో కలియదున్నడం ద్వారా భూమి మరింత సారవంతం అవుతుంది అని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ ఉప సంచాలకులు ఎం శివకుమారి తెలిపారు. నరసరావుపేట మండలం పాలపాడు గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం, నరసరావుపేట ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో పి. రామిరెడ్డి, వై.లింగయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు వేమారెడ్డిపాల్గొన్నారు.

క్లుప్తంగా...

● వినుకొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలో ఆగస్టు 7వ తేదీన జరిగే భారతకమ్యూనిస్టు పార్టీ పల్నాడు జిల్లా ద్వితీయ మహాసభను జయప్రదం చేయాలంటూ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ కోరారు. స్థానిక శివయ్య భవన్‌లో జిల్లా మహాసభ గోడప్రతులను సోమవారం ఆవిష్కరించారు.

● బొల్లాపల్లి: బొల్లాపల్లి పీఏసీఎస్ సొసైటీ ఛైర్‌పర్సన్‌గా పెసల వెంకట నారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తెలిపారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేటలోని ఎస్‌బీటీ అండ్ ఎస్‌వీసీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బ్యాంక్ ఆఫ్ బరోడా వారు వాటర్ డిస్పెన్సర్ సోమవారం అందజేశారు. బ్యాంక్ 118వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కళాశాలకు రూ.13,990 లు విలువ చేసే వోల్టాస్ కంపెనీ వాటర్ డిస్పెన్సర్ అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ కె.కరుణాకర్‌రావు, కళాశాల ఇన్‌చార్జి డాక్టర్ కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● శావల్యాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల నుంచి శనగనూనె ప్యాకెట్ల లోడుతో కైకలూరుకు వెళుతున్న లారీ గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై మండలంలోని కృష్ణాపురం సమీపంలో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకుపోయింది. దీంతో లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌లు ఇద్దరికీ స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వారిని దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి ప్రథమచికిత్స చేయించారు.

● రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల తహసీల్దార్ జరిగిన ప్రజా గ్రీవెన్స్‌లో మూడు ఫిర్యాదులు అందినట్టు తహసీల్దార్ బండి నిర్మల తెలిపారు. రొంపిచ్చ, రెడ్డిపాలెం గ్రామాల నుంచి సర్వేకు, అన్నదాత సుఖీభవ పథకంకు సంబందించి ఆధార్ సీడింగ్‌కు ఒక ఫిర్యాదు అందినట్టు ఆయన తెలిపారు.

● నాదెండ్ల: చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా నియమితులైన టీడీపీ కరిముల్లా, సొసైటీ ఛైర్మన్‌గా ఎన్నికైన నల్లమోతు హరిబాబులను సోమవారం తూబాడు గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో సమన్వయకర్త ఎన్ సదాశివరావు, మండల పార్టీ అధ్యక్షుడు బి.సత్యనారాయణ, నాయకులు డి.సాంబశివరావు, అజారుద్దీన్, యాసిన్, జి.నాగేశ్వరరావు, రఫీ, ఖాజావలి, మల్లిబాబు, రాజు తదితరులు ఉన్నారు.

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

● కలెక్టర్ అరుణ్‌బాబు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే, ఇతర అధికారులు

నరసరావుపేట టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పీ అరుణ్‌బాబు అన్నారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా జిల్లా నలుమూలలు నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ పీ అరుణ్‌బాబు అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి కే మురళి అర్జీలను స్వీకరించారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 249 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా పనిచేయాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరసా కల్పించారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు తమ పరిధిలోనివి కాన వృడు వెంటనే సంబంధి శాఖకు పరిష్కారం కోసం పంపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో భారీ వర్షం

● మురుగుమయమైన ప్రధాన వీధులు



వర్షపు నీటితో మునిగిపోయిన చిలకలూరిపేటలోని కళామందిర్ సెంటర్ బస్టాండ్



జలమయమైన చిలకలూరిపేట స్టీలు కొట్ల బజారు

చిలకలూరిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట పట్టణంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలో ప్రధాన వీధులు జలమయమయ్యాయి. ప్రధాన మురుగు కాలువలు ఆక్రమణలతో నిండి ఉండి పూడిక తీసే పరిస్థితి లేకపోవడంతో మురుగు నీరంతా రోడ్లపై ప్రవహించింది. దీంతో పట్టణంలోని ప్రధాన ప్రాంతాలలో అపరిశుభ్ర పరిస్థితి నెలకొంది. పట్టణంలో మురుగు కాలువల వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. పలుచోట్ల వర్షపు నీరు దుకాణాలు, గృహాల్లోకి చేరింది. వీధుల్లో మోకాలు లోతున నీరు ప్రవహించింది. పలు వీధులలో ద్విచక్రవాహనాలు నీట మునిగాయి. వర్షపు నీరు సంజీవనగర్‌ను ముంచెత్తింది. దీంతో ఆ ప్రాంతవాసులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పండరీపురం మెయిన్ రోడ్డుపై వర్షపు నీరు, మురుగునీరు కలిసి ఉధృతంగా ప్రవహించింది. ఎరువుల కొట్ల బజారు, స్టీలు కొట్ల బజారు, చంద్రమౌళి కూరగాయల మార్కెట్ ప్రాంతం, గ్రంథాలయం బజార్, బోసు రోడ్డు, రైస్ మిల్ బజారు, చిన్న రథం ప్రాంతం, పెదనందిపాడు రోడ్డు, ఆర్‌వీఎస్ హైస్కూలు, గౌడ పాలెం ప్రాంతాలు జలమయమయ్యాయి. క్లాసులు ముగిశాక సాయంత్రం విద్యార్థులు పాఠశాలల నుంచి ఇళ్లకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గొట్టిపాడు పంచాయతీ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

హామీలను నెరవేరుస్తున్న సీఎం చంద్రబాబు

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నాయుడు నెరవేరుస్తున్నారని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని 11వ వార్డు రైలుపేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మార్కెట్ యార్డు వద్ద నుంచి ప్రారంభమై రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న రైలుపేటలోని ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం రైలుపేటలోని మసీదుమాన్యం సమీపంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్‌పీ కాలనీ స్థలంలో రూ.3కోట్లతో షాదీఖానా, చిల్డ్రన్స్ పార్కు, బీసీ భవనం ఏర్పాటు చేసి తీరుతామన్నారు. గతంలో భర్త చనిపోతే భార్యకు పింఛన్ అందించిన దాఖలాలు లేవని, నేడు భర్త మృతిచెందిన భార్యకు రేషన్‌కార్డుతో పాటు పింఛన్ కూడా అందజేస్తున్నామన్నారు. ఇళ్లు, రేషన్‌కార్డులు, సంక్షేమ పథకాల అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కౌన్సిలర్ షకీలాబేగం, మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, విద్యుత్‌శాఖ ఏఈ పిచ్చయ్య, గుంటకల నాగేశ్వరరావు, కరీం, దావులూరి మునెయ్య, లింగా రామయ్య, సౌదాగర్ జానీ, గోల్డ్ కరిముల్లాతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యను పరిశీలించిన జీవీ

వినుకొండ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 11వ వార్డు రైలుపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం అనంతరం నూజెండ్లలోని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళుతున్న జీవీని స్థానికులు కారుఆపి తమ సమస్యను పరిష్కరించాలంటూ కారుకు అడ్డంగా నిలబడ్డారు. వచ్చి రైలుపేటలోని 2వ బజారులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను స్వయంగా చూడాలనటంతో జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. కేవలం 20అడుగుల దూరంలో రెండు సిమెంటు రోడ్లను కలపకపోవటంతో ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తెలపడంతో వెంటనే కమిషనర్‌ను పిలిచి వారం రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. వీధుల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

కష్టపడిన కార్యకర్తలకు సముచిత పదవులు: జీవీ


నూజెండ్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు శక్తి వంచన లేకుండా కృషిచేసిన నాయకులు, కార్యకర్తలకు సముచిత పదవులు ఇచ్చి గౌరవిస్తున్నామని చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రం నూజెండ్లలో నూజెండ్ల పీఏసీఎస్ నూతన ఛైర్‌పర్సన్‌గా బచ్చు అంజిరెడ్డి, మెంబర్లుగా గంగినేని బ్రహ్మయ్య, మందా ఏసుల ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి మన్ననలను పొందాలని సూచించారు. అదేవిధంగా జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ఆగస్టు మొదటి వారంలో సాగర్ జలాలు పీబీసీ కాలువకు వచ్చే విధంగా జీవీ ఆంజనేయులు సలహా మండలి సమావేశంలో ప్రత్యేకంగా తీర్మానం చేయించారన్నారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ జెడ్డా సుబ్బులు రామయ్య, మండల పార్టీ అధ్యక్షుడు గంగినేని బాబు, వినుకొండ మార్కెట్ యార్డు ఛైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్, గుర్రపునాయుడు సొసైటీ ఛైర్‌పర్సన్ ముంద్రు సుబ్బారావు, అప్పాపురం, ఐనవోలు డీసీలు నక్కా బుల్లీశ్వర రెడ్డి, రావుల బుజ్జి, లగడపాటి వెంకటరావు, పీఏసీఎస్ సీఈవో గంగినేని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మద్యం కుంభకోణంలో కోట్ల రూపాయల దోపిడీ

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) :వైసీపీ ప్రభుత్వం నాసిరకం మద్యాన్ని తయారు చేయించి ప్రజల రక్తాన్ని పీల్చి, మద్యం కుంభకోణంలో కోట్ల రూపాయలు దోపిడీ చేశారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వైఎస్ జగన్‌మోహనరెడ్డి మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడని, ఈ కుంభకోణంలో రూ.3500కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో దోపిడీచేసి అక్రమంగా సంపాదించిన సొమ్మును ఎన్నికల కోసం వినియోగించారన్నారు.వైసీపీ ప్రభుత్వం 2019లో అమలు చేసిన మద్యం విధానంతో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయన్నారు. ప్రముఖ మద్యం బ్రాండ్‌ల స్థానంలో నాసిరకం బ్రాండ్‌లను ప్రోత్సహించి, డిస్టిలరీల నుంచి నెలకు రూ 50.కోట్ల నుంచి రూ.60 కోట్ల లంచాలు వసూలు చేశారన్నారు. ఈ కేసులో ఇప్పటికే 12 మందిని అరెస్టు చేశారని, వారిలో కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి ఉన్నారని చెప్పారు. మద్యం కుంభకోణంలో దోచుకున్న డబ్బును దుబాయ్, ఆఫ్రికాలో లగ్జరీ ఆస్తులు, బంగారం, భూములు కొనుగోలు చేశారని ఆరోపించారు.

బ్యాడ్మింటన్‌లో ఎస్‌కేఆర్‌బీఆర్ విద్యార్థుల ప్రతిభ



విజేతలతో స్టేడియం నిర్వాహకులు

నరసరావుపేట కల్చరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) ఈ నెల 19, 20 తేదీలలో గుంటూరులో జరిగిన 52వ గుంటూరు జిల్లా బ్యాడ్మింటన్ పోటీలలో పట్టణంలోని ఎస్‌కేఆర్‌బీఆర్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం విద్యార్థులు రాణించినట్లు స్టేడియం కోచ్ డాక్టర్ వి.శరత్‌చంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఈ పోటీలలో అండర్-11 డబుల్స్ కేటగిరిలో బి.దినేష్‌రెడ్డి, వేదవచన్‌లు ద్వితీయస్థానం, అండర్-13 డబుల్స్ మహిళా విభాగంలో కె.చార్వీ, షేక్ ఆస్సిన్‌లు ద్వితీయస్థానం, అండర్-15 మహిళా విభాగంలో షేక్ సానియా ద్వితీయస్థానం సాధించి పతకాలు అందుకున్నట్లు తెలిపారు. విజేతలను స్టేడియం ఛైర్మన్ కాసు మహేష్‌రెడ్డి, డైరక్టర్ కేవీ పురుషోత్తం, అసిస్టెంట్ కోచ్‌లు ఎ.సాయి ప్రసాద్, షేక్ నసీమాలు అభినందించారు.

పాఠశాల ఆవరణలో నీరు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలంలో నిన్న కురిసిన వర్షానికి అచ్చమ్మపాలెం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిలిచిన నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. వర్షపు నీరు పాఠశాల ఆవరణలో చేరడంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో రావటంతో స్పందించిన నరసరావుపేట ఎంపీడీవో కృష్ణకుమారి వర్షపు నీరు నిలువకుండా ఇంకుడు గుంత తీయాలని పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు. సోమవారం పాఠశాల ఆవరణను పరిశీలించి వర్షపు నీరు నిల్వకాకుండా ఇంకుడు గుంత పనులు కాంట్రాక్టర్ ద్వారా ప్రారంభించారు. పాఠశాలలో ప్రాంగణంలో ఎక్సవేటర్ ద్వారా ఇంకుడు గుంతను తవ్వి నిల్వ ఉన్న వర్షపు నీటిని మళ్లించారు.

ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ వేతనాల చెల్లింపు

మతుకుమల్లి (శావల్యాపురం) జూలై 21 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధుల చొరవతో మండలంలోని మతుకుమల్లి గ్రామంలోని 12మంది ఉపాధి హామీ కూలీలకు ఏడాదిగా నిలిచిపోయిన ఉపాధి పనికి సంబంధించిన వేతనాలను ఎట్టకేలకు సోమవారం ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య ఆధ్వర్యంలో చెల్లించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మతుకుమల్లిలోని జడ్పీపాఠశాల పక్కనున్న తాగునీటి పథకం వద్ద పంచాయతీ అధికారులు ఉపాధిహామీ కూలీలతో ఇసుక మార్పించి, ఫిల్టర్ బెడ్లు శుభ్రం, మరమ్మతుల పనులు చేయించారు. కానీ అప్పటి ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ అధికారులు ఉపాధి హామీ పథకం కింద, గ్రామ పంచాయతీ నిధుల నుంచి రెండుచోట్ల బిల్లులు మార్చుకొని కూలీలకు మాత్రం వేతనాలు చెల్లించకుండా తీవ్రఇబ్బందులు పెట్టారు. దీనిపై కూలీలు జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి చింతా గంగయ్య సహకారంతో పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు పంచాయతీనిధుల నుంచి కూలీలకు వేతనాలు చెల్లించాలని వారు ఆదేశించడంతో ఎంపీడీవో 12మంది కూలీలకు రూ.1లక్ష వేతనాలుగా అందజేశారు.

ఇన్నర్ వీల్ క్లబ్ నూతన కార్యవర్గం పదవీ స్వీకారం



ఇంటర్ విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న శివరావు, తదితరులు

చిలకలూరిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట నూతన కార్యవర్గ పదవీ స్వీకార కార్యక్రమం సోమవారం స్థానిక రోటరీ హాలులో జరిగింది. క్లబ్ అధ్యక్షురాలిగా నార్నె జయలక్ష్మి, కార్యదర్శిగా చెన్నుపాటి చైతన్య పదవీ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా మాజీ శాసన సభ్యురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ పాల్గొన్నారు. ఇన్నర్ వీల్ క్లబ్ ద్వారా ప్రాంతంలో ప్రశంసనీయమైన రీతిలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అభినందించారు. ఇంటర్ విద్యార్థి మహేష్ బాబుకు రోటరీ క్లబ్ సభ్యులు కారుమంచి శివరావు రూ.15వేలు ఆర్థికసాయంగా అందచేశారు. కార్యక్రమంలో అతిథులుగా క్లబ్ మాజీ అధ్యక్షురాలు గట్టు సరోజిని, జిల్లా ఇన్నర్ వీల్ క్లబ్ ముఖ్యులు కె విజయలక్ష్మి, జి జయశ్రీ, ఐ సుభాషిని పాల్గొన్నారు.

ప్రసాద్‌కు నటశేఖర బిరుదుతో సత్కారం

చిలకలూరిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట సీనియర్ కళాకారుడు వంకాయలపాటి చెన్న కేశవ ప్రసాద్ (వీసీహెచ్‌కే ప్రసాద్)కు నటశేఖర బిరుదుతో ఘన సత్కారం జరిగింది. కాకినాడలో అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నాలుగు రోజులు పాటు కొనసాగి ఆదివారం రాత్రి జరిగిన ముగింపు కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు కర్రి అచ్యుత రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి. దయానందబాబు, ఆంధ్రప్రదేశ్ నాటక పరిషత్‌ల సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు, మాజీమంత్రి చిట్యాల రామచంద్రరావులు ప్రసాద్‌ని సత్కరించి బిరుదు ప్రదానం చేశారు. ఐదు దశాబ్దాలుగా దాదాపు 70 నాటికలు, వెయ్యికి పైగా ప్రదర్శనలు ఇచ్చిన ప్రసాద్ వివిధ పాత్రలలో ద్వారా విలక్షణ నటుడిగా ఉభయ రాష్ట్రాల్లో గుర్తింపు పొందారని వారు ఈ సందర్భంగా ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇటీవలనే ఆయన కందుకూరి అవార్డుతో పాటు గతంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి నంది అవార్డు కూడా పొందారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వెనుకబడిన ప్రాంతాల నిరుపేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా 150 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేసిందని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. రైలుపేటలో మసీదు మాన్యానికి సమీపంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెనుకబడిన వినుకొండ ప్రాంతంలో నూతనంగా అర్బన్ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించుకోవడం అభినందనీయమన్నారు. క్లీన్ అండ్ గ్రీన్‌లో వినుకొండకు 9వ ర్యాంక్ సాధించడంపై మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్‌ను అభినందించారు. కార్యక్రమంలో జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కౌన్సిలర్ షకీలాబేగం, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో మక్కెన పద్మావతి, డీపీవో వన్నూరు బాషా, మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, నూతన వైద్యశాల డాక్టర్ సోముసాయితో పాటు పట్టణంలోని అర్బన్ వైద్యశాల వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, మున్సిపల్ ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా ఫిర్యాదులను పరిష్కరించండి

● ఎస్పీ కంచి శ్రీనివాసరావు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం జరిగింది. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొని ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, మోసం సమస్యలకు సంబంధించి 98ఫిర్యాదులు అందాయి. వినుకొండ మండలం దొండపాడు గ్రామానికి చెందిన కొప్పుల కరుణ భర్త 2021లో మరణించారు. ఆమె ఇద్దరు కుమార్తెలకు వివాహం చేశారు. బావ కొప్పుల వెంకట్రావు వేధింపులపై ఎస్పీకి అర్జీ ఇచ్చారు. నరసరావుపేటకు చెందినవీర రాఘవులు నరసరావుపేట పట్టణానికి చెందిన మాజేటి విజయ్‌కృష్ణ రూ.20,00,000 అప్పుగా ఇచ్చాడు. మూడు సంవత్సరాలు దాటినా డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తుండటంపై ఫిర్యాదు చేశారు.



నూజెండ్ల జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

నూజెండ్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ మేడం జయ రామిరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా రక్షిత తాగునీరు అందించాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు తమ శాఖలవారీగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిని సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జడ్పీటీసీ జెడ్డా సుబ్బులు, వినుకొండ మార్కెట్ యార్డు ఛైర్మన్ మీసాల మురళీకృష్ణయాదవ్, ఎంపీడీవో పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ పీ అజయ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభం

నరసరావుపేట టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట జేఎన్‌టీయూకే కళాశాలలో మల్టీమీడియా క్వాలిటీ అసెస్మెంట్ టెక్నిక్స్, లాటెక్స్ టూల్ అనే అంశంపై సోమవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి వివిధ కళాశాలల నుంచి 35మంది హాజరయ్యారు. చెన్నై ఎస్ఎన్ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పీ అజయ్‌కుమార్‌రెడ్డి మల్టీమీడియా విశిష్టత, లాటెక్స్ టూల్ ఉపయోగం గురించి తెలియజేశారు. ఎఫ్‌డీపీ ఛైర్‌పర్సన్, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ లాటెక్స్ టూల్‌తో అకడమిక్ రిపోర్ట్స్, రీసెర్చ్ పేపర్స్‌లో ఇంపార్టెన్స్ నిజజీవితంలో మల్టీమీడియాలో ఇమేజ్, వీడియో, ఆడియో కంటెంట్ చాలా కచ్చితమైనన్నారు. ఇందులో నేర్చుకున్నని కళాశాలలో టీచింగ్ మెథడాలజీలో ఉపయోగించాలన్నారు. కన్వీనర్ డాక్టర్ ఏ గంగాధర్ మాట్లాడుతూ ఎఫ్‌డీసీ ప్రోగ్రాం నుంచి నేర్చుకొని వెళ్తారని, ప్రతి ఒక్కరూ సందేహాలను నివృత్తి చేసుకోవటం, ఆలోచనలను రిసోర్స్ పర్సన్స్ ముందు వ్యక్తపరచాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎస్ కిషోర్‌బాబు, ఎఫ్‌డీపీ కో ఆర్డినేటర్ సంతోష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

రొంపిచర్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల పడమటిపాలెంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ భవనంలో బోనస్‌ల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేనేజర్ నరేష్ పాల్గొన్నారు. గత ఆర్థిక సంవత్సరానికి 78మంది పాల ఉత్పత్తిదారులకు రూ.100కి రూ.9 చొప్పున బోనస్‌లను అందజేశారు. డైరీ నుంచి రూ.2.22 లక్షలు, మిగులు నిధుల నుంచి రూ.2.53 లక్షలు, మొత్తం రూ.4.75 లక్షలు బోనస్‌లను అందజేశారు. మేనేజర్ నరేష్ మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. డీజీసీ వైద్యశాల ద్వారా పాల ఉత్పత్తిదారులకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.